

మధురానగర్‌లో చోరీ

ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్‌లో చోరీ జరిగింది. ఒక ఇంటి తలుపులు పగులగొట్టి లోపల బీరువాలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దొంగలు దోచుకుపోయారు.

- 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణ

- వార్త 6వ పేజీలో



దొంగలు విరగ్గొట్టిన ఇంటి తలుపు గొళ్లెం



కొన్ని మసాజ్ సెంటర్లలో అదే ప్రత్యేకత

- పోలీసుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు

మసాజ్ ముసుగులో వ్యభిచారం

- అందుకు ప్రతిగా నెలవారీ మామూళ్లు అందుతున్నాయని ప్రచారం
- అన్ని సెంటర్ల నుంచి రూ.15 లక్షల వరకూ కలెక్షన్లు
- కొన్ని మసాజ్ సెంటర్ల నిర్వాహకులే పోలీసులకు మధ్యవర్తులు..
- ఏదైనా ఫిర్యాదు వస్తే నిర్వాహకులకు సమాచారం చేరవేత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని కొన్ని మసాజ్ సెంటర్లు వ్యభిచార కూపాలుగా మారిపోయాయి. మసాజ్ ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరిగిపోతోంది. దీనిపై పోలీసులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ నిర్వాహకుల నుంచి నెలవారీ మామ్మూళ్లు అందుతుండడంతో అటువైపు చూడడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పోలీసులు ఆకస్మిక తనిఖీల పేరుతో నిర్వాహకులను పరోక్షంగా బెదిరించి దారికి తెచ్చుకున్నారని ఆ శాఖ సిబ్బందే విమర్శలు గుప్పిస్తున్నారు.

సాధారణ మసాజ్ సేవలందించే సెంటర్ల నుంచి వచ్చే మామూళ్ల కంటే క్రాస్ మసాజ్ చేసే సెంటర్లు, వ్యభిచారం నిర్వహించే సెంటర్ల నుంచి రెట్టింపు మామూళ్లను గుంజుతున్నారని పోలీస్ శాఖలోనే ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. తాజాగా సీతంపేటలోని మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో బయటపడడం మసాజ్ సెంటర్ల వ్యవహారాలపై చర్చకు దారితీసినట్టయింది.

కొన్నాళ్ల కిందటి వరకు మెట్రో పాలిటన్ నగరాలకు పరిమితమైన మసాజ్ సెంటర్ల సంస్కృతి ఇప్పుడు నగరంలో వేళ్లానుకుపోయింది. శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం సేవలందించాల్సిన మసాజ్ సెంటర్లలో అన్ని రకాల సేవలు, సుఖాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వీటికి డిమాండ్ పెరిగిపోయింది. ఆదాయం దండీగా ఉండడంతో నగరంలో మసాజ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. పోలీసుల అంచనా ప్రకారం విశాఖపట్నంలో ప్రస్తుతం 260 వరకు మసాజ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో అత్యధికం సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, బీచ్ రోడ్డు, వీఐపీ రోడ్డు, సిరిపురం, గాజువాక, మధురవాడ, ద్వారకానగర్, సీతంపేట, లాసెన్స్‌బే కాలనీ వంటి ప్రాంతాల్లో ఉన్నాయి. బ్యూటీ పార్లర్లు, స్పాలు, మసాజ్ సెంటర్లు, రిలాక్స్ సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్స్, హెల్త్ క్లబ్‌లు... ఇలా పేర్లు ఏవైనా అన్నీ బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్‌కు సంబంధించిన సేవలను మాత్రమే అందించాలి. బ్యూటీషియన్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ నిబంధనల ప్రకారం మసాజ్ సెంటర్లకు వచ్చే మహిళలు, పురుషులు వచ్చిపోయేందుకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ... మిగతా 6వ పేజీలో

నగరంలో మొత్తం మసాజ్ సెంటర్లు	260
వ్యభిచారం జరిగేవి	50 (అంచనా)
ఒక్కో సెంటర్ నుంచి పోలీసులకు మామూళ్లు	రూ.5 వేలు
వ్యభిచారం జరిగే వాటి నుంచి	రూ.10 వేలు
నెలకు మొత్తం వసూలు చేస్తున్న మొత్తం	రూ.15 లక్షలు

నేడే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

గురువుల విజేత ఎవరో!

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి

మొత్తం ఓటర్లు: **22,493**

పోలైన ఓట్లు: **20,794**



పాకలపాటి రఘువర్మ



గాదె శ్రీనివాసులు నాయుడు



కోరెడ్ల విజయగౌరి



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు

- ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు, 100 మంది సిబ్బంది
- తొలుత బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోసి.. 25 చొప్పున కట్టలు
- డ్రమ్ములో వేసి కలియతిప్పిన తరువాత టేబుళ్లకు సర్దుబాటు
- తొలి ప్రాధాన్యతలో 50 శాతానికి మించి ఒక్క ఓటు వచ్చినా విజేతగా ప్రకటింపు
- ఇదే జరిగితే రాత్రి 8 గంటల్లోగా ఫలితం వెలువడే అవకాశం
- లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఫలితం వెల్లడికి మరింత సమయం

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):


ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపు ఈ నెల మూడో తేదీ సోమవారం ఉదయం ప్రారంభం కానున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగంలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రాన్ని విశాఖ జిల్లా డీఆర్వో భవానిశంకర్ ఆదివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత నెల 27వ తేదీన శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని 123 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 22,493 మంది ఉపాధ్యాయులకుగాను 20,794 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 13,508 మందికిగాను 12,576 మంది, మహిళలు 8,985 మందికి 8,218 మంది ఓటు వేశారు.

ఓట్ల లెక్కింపునకు 20 టేబుళ్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు అధికారులు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరు చొప్పున సిబ్బంది వుంటారు. వీరికి అదనంగా మరికొంత మంది సిబ్బందిని అందుబాటులో వుంచుతారు. తొలుత సోమవారం ఉదయం అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ ఓపెన్‌చేసి అక్కడ నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేరుస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు బ్యాలెట్ బాక్సుల సీళ్లను పరిశీలించి, అన్నీ సక్రమంగా వుంటే తెరుస్తారు. అన్ని బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను కుప్పగా పోస్తారు. తరువాత 25 చొప్పున ఓట్లను కట్టలుగా కడతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ఓట్ల కట్టలను డ్రమ్ములో వేసి కలియతిప్పుతారు. అనంతరం ఒక్కో టేబుల్‌కు వెయ్యి ఓట్లు.. అంటే 40 కట్టలను అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం అయ్యే అవకాశం వుంది. భోజనం చేసిన తరువాత టేబుళ్ల వారీగా ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. అభ్యర్థులకు వచ్చిన తొలి ప్రాధాన్యత ఓట్లను వారికి కేటాయించిన ట్రేలలో వేస్తారు. మిగిలిన ఓట్ల కట్టలను కూడా టేబుళ్ల వారీగా సర్దుబాటు చేస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొత్తం ఒక రౌండ్‌లోనే చేపడతారు. చెల్లిన ఓట్లలో 50 శాతానికి మించి ఒక్క ఓటు అదనంగా ఎవరికి వస్తే ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే రాత్రి ఎనిమిది గంటలకల్లా ఫలితం వెలువడే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఎవరికీ 50 శాతం కన్నా ఎక్కువ ఓట్లు రాకపోతే మొదటి ప్రాధాన్యత ఓట్లలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరిని ఎలిమినేట్ చేసుకుంటూ వస్తారు. మొదటి స్థానంలో వున్న అభ్యర్థి ఎప్పుడైతే 50 శాతం ఓట్లను అధిగమిస్తారో అప్పుడు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును నిలుపుదల చేసి, ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న విశాఖపట్నం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ నేతృత్వంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఆర్వోలు, ఇతర అధికారులు కౌంటింగ్ కేంద్రంలో ఉంటారు. ఎన్నికల సంఘం తరపున పరిశీలకునిగా వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం.ఎం.నాయక్ కౌంటింగ్‌ను పర్యవేక్షిస్తారు. మొత్తంగా 100 మంది అధికారులు, సిబ్బంది కౌంటింగ్ విధుల్లో ఉంటారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ ఎన్నికల్లో పోటీచేసిన పది మంది అభ్యర్థుల తరపున మొత్తం 160 మందికి కౌంటింగ్ ... మిగతా 6వ పేజీలో

కనువిందు చేసిన కురుసుర..



గగనంలో ఆదివారం సాయంత్రం అందమైన దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యాస్తమయ సమయాన పడమర దిక్కున మబ్బులు వివిధ రంగుల కలయికతో అలరించాయి. ఎరుపు, ఆరెంజ్, నలుపు కలయికతో ఉన్న ఆకాశం దిగువున సాగర తీరంలోని కురుసుర మ్యూజియం చూపురులకు కనువిందు చేసింది.

వెనక్కి మళ్లిన సముద్రం



ఆర్కే బీచ్ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం సముద్రం వెనక్కి వెళ్లింది. దీంతో తీరంలో రాళ్లు తేలడంతో సందర్శకులు వాటిపైకి వచ్చి ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. కెరటాల ఉధృతి తగ్గడంతో (లోటైడ్) సంద్రం వెనక్కి వెళ్లిందని, అంతకు మించి ప్రత్యేక విశేషమేమీ లేదని సాగర అధ్యయన నిపుణుడొకరు తెలిపారు.

సవాళ్ల స్వారీ!

ఏయూ నూతన వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ ముందు అనేక సవాళ్లు, సమస్యలు

- ప్రధానమైన సమస్యగా ఫ్యాకల్టీ కొరత.. పరిష్కరించడమే పెను సవాల్
- శతాబ్ది వేడుకల వేళ నిధుల సమీకరణ పరీక్షే.
- గత పాలకుల నిర్ణయాలపై తీసుకునే చర్యలపైనా సర్వత్రా ఆసక్తి



వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్



విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌కు వర్సిటీలో అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే తన లక్ష్యమని ప్రకటించిన వీసీకి ఈ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో అనేక సమస్యలు సవాళ్లు విసరనున్నాయి. ఇందులో అత్యంత కీలకమైనది ఫ్యాకల్టీ కొరత. వర్సిటీలో సుమారు 1,200 మంది వరకు అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం 190 మంది మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారు. అనేక కీలక విభాగాల్లో అధ్యాపకులు లేక విద్యార్థులకు నాణ్యమైన బోధన కూడా అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించుకోవడం నూతన వీసీకి తలకు మించిన భారంగానే చెప్పాలి. ఎందుకంటే ఒక్క ఏయూ కోసమే పోస్టులను భర్తీ చేసే పరిస్థితి ఉండదు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలతో పాటే రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయాలి. ఇందుకు సంబంధించి గతంలోనే నోటిఫికేషన్ వచ్చింది.. కొన్ని సాంకేతిక కారణాలతో ఆగిపోయింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా వర్సిటీలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో కొన్ని పోస్టులనైనా భర్తీ చేయించుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంటుంది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వీసీ రాజశేఖర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ఖాళీల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. వీసీ ముందున్న మరో ప్రధానమైన సవాల్ శతాబ్ది ఉత్సవాల నిర్వహణ. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించి వచ్చే ఏడాది వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు అవసరమైన నిధుల సమీకరణ, పూర్వ విద్యార్థులను కనెక్ట్ చేయడం, ... మిగతా 6వ పేజీలో

---

38 మంది బైక్ రేసర్ల అరెస్టు

- 38 వాహనాలు స్వాధీనం
- ఎవరైనా బైక్ రేసింగ్‌లు, ప్రమాదకరంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు
- ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్



స్వాధీనం చేసుకున్న బైకులతో ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం/మద్దిలపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

నగరంలో బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న 38 మంది యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రేసింగ్‌కు వినియోగించిన 38 బైకులను స్వాధీనం చేసుకున్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వివరించారు. గతనెల 27వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో అధిక సంఖ్యలో యువకులు బైకులపై సిరిపురం జంక్షన్‌కు, పెదవాల్తేరు జంక్షన్, బీచ్ రోడ్డులో గుమికూడి అక్కడ నుంచి కరకచెట్టు పోలమాంబ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పోలమాంబ ఆలయ జంక్షన్ నుంచి ప్రభుత్వ మానసిక వైద్యశాల రోడ్డులోకి అందరూ ఒకేసారి చేరి బైకులతో ఒళ్లు గగుర్పొడిచేలా స్టంట్‌లు చేయడం ప్రారంభించారు. ఒకేసారి అపరిమిత వేగంతో వాహనాలను నడపడం.. ఆ వెంటనే బైక్ స్టాండ్‌లు రోడ్డుకు తగిలించేలా చేసి అగ్గి పుట్టించడం, హారన్ కొట్టి ఆ రోడ్డులో రాకపోకలు సాగించే వారిని భయభ్రాంతులకు గురి చేశారు. దీనిపై కొంతమంది పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బైక్ రేసింగ్‌కు పాల్పడిన 38 మందిని బైకులతో సహా అదుపులోకి తీసుకుని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారందరిపై కేసులు నమోదు చేసి బైక్‌లను సీజ్ చేశారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో ... మిగతా 6వ పేజీలో

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నేటి సాయంత్రంలోగా తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశం

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై అభిప్రాయ సేకరణ

- ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగింత
- ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగుతులు వెనక్కి.

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో వివిధ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు అస్తవ్యస్తం కావడానికి కారణమైన జీవో 117 రద్దు నేపథ్యంలో తీసుకోవలసిన అంశాలపై తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. జీవో 117 రద్దుతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టేందుకు ముసాయిదా రూపొందించింది. దీని ప్రకారం ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను వెనక్కి తీసుకువస్తున్నారు. అదే సమయంలో ప్రతి గ్రామ పంచాయతీ/వార్డుల్లో 60 మంది పిల్లలుంటే మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేస్తారు. పంచాయతీలో 60 మంది పిల్లలు.. అంత కంటే ఎక్కువగా ఉన్న గ్రామంలో ఏర్పాటు చేసే మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను కొనసాగిస్తారు. ఆయా పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ పాఠశాలకు తరలించాలని పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదించింది. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న పంచాయతీల్లో ఒకటి కంటే ఎక్కువగా మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తారు. కిలోమీటరులోపు దూరం ఉన్న పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల పిల్లలకు రవాణా చార్జీలను చెల్లిస్తారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ మేరకు నూతన విధానాన్ని అమలు చేసే ముందు ఆయా గ్రామాల్లో తల్లిదండ్రుల కమిటీల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రంలోగా జిల్లాలోని 586 పాఠశాలల యాజమాన్య కమిటీల నుంచి అభిప్రాయం తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సమ్మతమా? కాదా అనే దానిపై అభిప్రాయాలు తెలుసుకోవాలని ఆయా గ్రామాల్లోని పాఠశాలల హెచ్‌ఎంలకు బాధ్యత అప్పగించారు.



పెదగంట్యాడలోని మరడ దాసరిపేట పాఠశాలలో ఒకే విద్యార్థి, ఒకే ఉపాధ్యాయిని (ఫైల్ ఫొటో)

జీవో 117 రద్దు తరువాత రూపొందించే పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు సంబంధించి ముసాయిదా వివరాలను జిల్లాలో తొలుత కలెక్టర్, ఆ తరువాత ఎమ్మెల్యేలకు జిల్లా విద్యాశాఖ అందజేసింది. దీనిపై ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కొన్నిచోట్ల ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.07
సహారి (మంగళ)	4.57

కాశీ విశ్వేశ్వర ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్‌) మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం నగరపాలెంలో గల కాశీవిశ్వేశ్వర ఆలయానికి సీసీ కెమెరాలను ఆదివారం అమర్చారు. బీచ్‌ రెస్టారెంటు అధినేత తమటాపు శ్రీకాంత్‌ వీటిని దేవాలయానికి అందజేశారు. దేవాలయాల్లో దొంగతనాలు జరగకుండా, కొందరు ఆకతాయి చేష్టలకు పాల్పడకుండా ఈ కెమెరాలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు.

ఆదివారం నుంచి ఈ కెమెరాలు అందుబాటులోకి వచ్చినట్టు చెప్పారు. దీంతో ఇవి నిరంతరాయంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. దేవాలయానికి సీసీ కెమెరాలు అందించిన శ్రీకాంత్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తీరంలో విదేశీయుల సందడి



పారా గ్లైడింగ్‌లో విదేశీ యువతి శిక్షణ

సాగర్‌నగర్‌, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో శనివారం విదేశీయులు సందడి చేశారు. తీర ప్రాంత అందాలను ఆస్వాదిస్తూ గడిపారు. దక్షిణాఫ్రికా, కెనడా, యూఎస్‌ఏ తదితర దేశాల నుంచి ఇస్కాన్‌ మందిరంలో అంతర్జాతీయ నాటక ప్రదర్శనకు విచ్చేసిన విదేశీయులు ఆటవిడుపుగా ఇస్కాన్‌ ఎదురుగా సముద్రతీరంలో హుషారుగా తిరగడం సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ఇదే తీరంలో పారాగ్లైడింగ్‌లో శిక్షణ పొందుతూ ఓ యువతి కనువిందు చేసింది

రచయితలను ప్రోత్సహిస్తాం

భీమునిపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త రచయితలను ప్రోత్సహిస్తామని కళాసాహితి అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ చెప్పారు. పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రచయితల్లో సృజనాత్మక వెలికి తీయడానికి వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం వెలిచేరు కదా వేదిక తరఫున కథల పోటీ నిర్వహించారు. విజేతలకు రచయిత చంద్రశేఖర్‌ బహుమతులు అందించారు. అంతకుముందు కళాసాహితి సభ్యులు అడిదం సన్యాసిరాజు మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.రామానాయుడు, పి.సురేశ్‌, ఎం.లక్ష్మణరావు, బి.వేంకటేశ్వర్లు, వెంకటేశ్వర దాసు, కోటయ్య, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బాప్టిస్ట్‌ చర్చి సంఘం నూతన కార్యవర్గం



సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

భీమునిపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భీమిలి పురాతన ఆంధ్రా బాప్టిస్ట్‌ చర్చి సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎస్‌ఎం.సుధాకర్‌, ఉపాధ్యక్షులుగా విజయమ్మ రేనాల్డ్స్‌, హెచ్‌.జాన్‌సన్‌రాజు, కార్యదర్శిగా ఎన్‌.రవికుమార్‌, సహాయ కార్యదర్శిగా కె.స్టీవెన్‌, కోశాధికారిగా పీఎస్‌.చంద్‌, సహాయ కోశాధికారిగా విలియంకేరీ, జేపీ.సుదర్శన్‌ ఎన్నికయ్యారు. డీకెన్‌ బోర్డు చైర్మన్‌గా ఎస్‌.మోహన్‌ కుమార్‌ ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులుగా కుమార్‌, అనిల్‌, లివింగ్‌స్టన్‌, ఐజాగ్‌ వ్యవహరించారు. పాస్టర్‌ విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

38 మంది బైక్‌ రేసర్ల అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హాజరుపరిచాక కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని ఏడీసీపీ తెలిపారు. ఎవరైనా బైక్‌ రేసింగ్‌లు, ప్రమాదకరంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేసింగ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్‌ ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలను పాటించని వాహన చోదకులకు కొత్తగా అమలులోకి వచ్చిన చట్ట ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జోన్‌-1 ట్రాఫిక్‌ ఏసీపీ వాసుదేవరావు, ఈస్ట్‌ సర్కిల్‌-1 ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌, ఈస్ట్‌ సర్కిల్‌-2 ట్రాఫిక్‌ సీఐ అమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురువుల విజేత ఎవరో!

... 5వ పేజీ తరువాయి

ఏజెంట్‌ పాసులు జారీ చేశారు.

గెలుపుపై ముగ్గురు అభ్యర్థుల్లోనూ ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీచేశారు. వీరిలో సిట్టింగ్‌ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడికి బీజేపీలో వుండే ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతోపాటు కొన్ని వామపక్షాలు పనిచేశాయి.

మధురవాడలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండు నెలల్లో 322 మందికి చికిత్స
- ప్రైవేటు ఆస్పత్రుల్లో మరింత మంది బాధితులు..
- జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆగ్రహం



స్వతంత్రనగర్‌లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

మధురవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఊరకుక్కలు ప్రజలను భయపెడుతున్నాయి. చీకటిపడితే రహదారులపై వెళుతున్న వారి వెంటపడుతూ దాడి చేస్తున్నాయి. వీటి దెబ్బకు రోజూ ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో పెద్దగా అరుస్తూ ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండడంతో వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. వాహనాలు అదుపుతప్పి గాయాల పాలుతున్నారు. పగటి పూడి పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడి చేస్తుండడంతో వారు భయానికి గురవుతున్నారు. కుక్కలకు భయపడి పిల్లలను బయటకు పంపడమే మానుకున్నామని పలువురు వాపోతున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం..

వీటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ అధికారులు చెబుతున్నా కుక్క కాటు బాధితులు మాత్రం రోజురోజుకూ పెరుగుతుండడం గమనార్హం. సగటున మధురవాడ పరిసరాల్లో రోజుకు 5 నుంచి 10 మంది వరకు కుక్కకాటుకు గురవుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా దారుణంగా ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు ఈ సమస్యనుఅసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ, స్వతంత్రనగర్‌ కాలనీ, పోర్టుకాలనీ, అయోధ్య నగర్‌, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని ఆయా ప్రాంతాల వాసులు అంటున్నారు. కుక్కలు పగటి సమయంలో కూడా గుంపులుగా సంచరిస్తూ ప్రజల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ద్విచక్రవాహన చోదకులను కుక్కలు వెంబడించడంతో వాహనాలు అదుపు తప్పి పలువురు గాయపడుతున్నారు. మధురవాడ పరిసరాల్లోని నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో 322 మంది కుక్క కాటు బాధితులు చికిత్స పొందారు. మధురవాడ పీహెచ్‌సీలో 162 మంది, వాంబే కాలనీ యూపీహెచ్‌సీలో 71 మంది, స్వతంత్రనగర్‌ యూపీహెచ్‌సీలో 41 మంది, మిథిలాపురి వుడాకాలనీలోని యూపీహెచ్‌సీలో 48 మంది బాధితులు చికిత్స పొందారు. వీరితో పాటు మరికొందరు బాధితులు ప్రైవేటు ఆసుపత్రుల్లో వ్యాక్సిన్లు వేయించుకున్నారు. జీవీఎంసీ ఆరోగ్యశాఖాధికారులు చర్యలు తీసుకొని కుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగ్గా సేవలు అందించాలి

ఆర్టీసీ విజయనగరం జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎ.విజయ్‌కుమార్‌



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్టీసీ జోనల్‌ ఈడీ విజయ్‌కుమార్‌

ద్వారకాబస్‌స్టేషన్‌/ మధురవాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ విజయనగరం జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎ.విజయ్‌కుమార్‌ ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి సూచించారు.

ఆయన మధురవాడ డిపోను ఆదివారం సందర్శించారు. డిపో అడ్మిస్ట్రేషన్‌, గ్యారేజీ విభాగాలను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. బస్సుల నిర్వాహణ పటిష్టంగా ఉండాలన్నారు. మార్గమధ్యంలో ఎటువంటి బ్రేక్‌డౌన్‌లు లేకుండా సకాలంలో ప్రయాణికులను గమ్యానికి చేర్చాలన్నారు. శివరాత్రి స్పెషల్స్‌ ఆపరేట్‌ చేయడంలో సహకరించిన సిబ్బందిని అభినందించారు. ఈ నెల 5,6 తేదీల్లో గీతం కళాశాలలో జరగనున్న జాబ్‌మేళాకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సిబ్బంది సిద్ధం కావాలన్నారు. విశాఖ రీజనల్‌ మేనేజర్‌ బి.అప్పలనాయుడు, అసిస్టెంట్‌ ఇంజినీర్‌ రాజేశ్వరి, ట్రాఫిక్‌ సూపర్‌ వైజర్‌ దుర్యోధన, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

దాకమర్రిలో గీతా ప్రచారం



ఆధ్యాత్మిక గ్రంథలను ప్రదర్శిస్తున్న మహిళలు

భీమునిపట్నం (రూరల్‌) మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం దాకమర్రిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గీతా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మహిళలకు భగవద్గీత గ్రంథాలు, పలు ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. జ్ఞానవేదిక అధ్యక్షుడు కె.త్రినాథరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జి.సూరప్పడు, ఎస్‌.శ్రీనివాస్‌, సూర్యనారాయణ, అప్పలనాయుడు భవానీ, రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు. ప్రబోధానంద యోగీశ్వర స్వామి రాసిన పుస్తకాలను కూడా పంపిణీ చేశారు.

దేహం కాదు.. కృష్ణ ప్రేమ శాశ్వతం

- అంతర్జాతీయ నాటక కళాకారుడు, కెనడా వాసి భక్తిమార్గస్వామి మహరాజ్‌



అంతర్జాతీయ నాటక కళాకారులు ప్రదర్శిస్తున్న వామనవతారం నాటక ప్రదర్శన

సాగర్‌నగర్‌, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దేహం కాదు.. కృష్ణ ప్రేమ శాశ్వతమని అంతర్జాతీయ నాటక కళాకారుడు, కెనడా వాసి భక్తి మార్గస్వామి మహరాజ్‌ ఉద్బోధించారు. ఇస్కాన్‌ మందిర ప్రాంగణంలోని కళావేదికపై కెనడా, ఆఫ్రికా తదితర దేశాల నుంచి విచ్చేసిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక రంగ కళాకారులు ప్రదర్శించిన వామనవతారం నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తిమార్గస్వామిమహరాజ్‌ మాట్లాడుతూ మానవాళికి దేహం శాశ్వతం కాదన్న విషయనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. శాశ్వతమైన కృష్ణతత్వాన్ని అలవరచుకున్న వారి జీవితం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా భక్తులు హరే కృష్ణ మహా మంత్రాన్ని భజన చేస్తూ భక్తులు ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్‌ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు, మాతాజీ నితాయిసేవని ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ.రాజశేఖర్‌, వంశీకృష్ణప్రభు తదితరులు పాల్గొన్నారు. నాట్యాలయ డాన్స్‌ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన వేంకటేశ్వర కల్యాణం అందరినీ ఆకట్టుకుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భీమిలిలో కలిసిన 1975-76 బ్యాచ్‌ విద్యార్థులు

భీమునిపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భీమిలి ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (టీటీఐ)లో 1975-76లో శిక్షణ పొందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. స్థానిక గుప్తావీధిలో సాయి సదనంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కన్వీనర్లు టి.భీమారావు, వి.గజ్జలమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వారంతా నాటి ఆనందదాయక సంఘటనలను గుర్తు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ప్రముఖ సీనియరు అడ్వకేట్‌ కోట మల్లికార్జునరావు, కోట పద్మారాణి దంపతులు, పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, పూర్వ విద్యార్థులు ఎ.సాంబమూర్తి, బి.ఈశ్వరరావు ప్రసంగించారు.

ఆరోగ్యంపై సంపూర్ణ అవగాహన అవసరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొమ్మాది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం విషయంలో సంపూర్ణ అవగాహన అవసరమని ప్రముఖ న్యూరాలజీ బగాది సునీల్‌ చెప్పారు. ఆదివారం శివశక్తి నగర్‌లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన మందులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య నిపుణులు పైడి వేణుమాధవి, కళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ఆర్‌.వెంకటరమణ, టి.శేఖర్‌, బి.జగదీశ్వరావు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్‌ ఆర్ట్స్‌ నేర్చుకోవాలి

కొమ్మాది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు మార్షల్‌ ఆర్ట్స్‌ నేర్చుకోవాలని టీడీపీ ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌ చెప్పారు. పీఎం.పాలెంలో ఆదివారం కరాటే పోటీలను ప్రారంభించారు. పోటీలలో ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందిస్తామన్నారు. సంఘం జిల్లా చైర్మన్‌ పోతిన ప్రసాద్‌ పాల్గొన్నారు.

మధురానగర్‌లో చోరీ

- 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణ



రెడ్డికంచరపాలెంలో చోరీ జరిగిన ఇంటిలో బీరువా పరిశీలిస్తున్న పోలీసులు

సీతంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్‌ పరిధిలోని మధురానగర్‌లో చోరీ జరిగింది. ఒక ఇంటి తలుపులు పగలగొట్టి లోపల బీరువాలోలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దొంగలు దోచుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సీతంపేట మధురానగర్‌లోని రాధమాదవ్‌ టవర్స్‌ మొదటి అంతస్తులో కె.కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఒక కార్ల షోరూమ్‌లో మేనేజర్‌గా చేస్తున్న కృష్ణ, శనివారం ఉదయం కాకినాడలోని బంధువుల ఇంటికి కుటుంబీకులతో వెళ్లాడు. ఆదివారం ఉదయం అపార్టుమెంట్‌లో పక్కన ఉంటున్న నివాసితులు ఇంటి గెడ, గొళ్లాం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి విసయాన్ని కృష్ణకు తెలిపారు. దీంతో హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా బీరువా విరగొట్టి ఉంది. అందులో దాచిన సుమారు 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ జరిగినట్టు గుర్తించి ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డికంచరపాలెంలో ఒకటిన్నర తులాల బంగారం అపహరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉంచిన ఒకటిన్నర తులాల బంగారం, రూ.85 వేలు నగదును అపహరించుకుపోయారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రెడ్డి కంచరపాలెంలో ఉంటున్న రంధి సత్య నారాయణ బంధువుల పెళ్లి కోసం శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దేవరాపల్లి వెళ్లారు. పెళ్లి పూర్తయిన తర్వాత ఆదివారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి రాగా ప్రధాన ద్వారం తలుపునకు వేసిన గడియ కత్తిరించి ఉండడంతో కంగారుపడి ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. బీరులో ఉంచిన నగదు, బంగారం కనిపించలేదు. దీంతో కంచరపాలెం క్రైమ్‌ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ప్రధాన ద్వారం తలుపునకు ఉన్న గడియను కట్‌ చేసి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కంచరపాలెం క్రైమ్‌ పోలీసులు తెలిపారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై అభిప్రాయ సేకరణ

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల తరలింపుపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గాజువాక, భీమిలిలో ఇటువంటి సమస్య ఎక్కువగా ఉండడంతో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావులు కొన్ని సూచనలు చేశారని తెలిసింది. ప్రధానంగా యూపీ పాఠశాలల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరాజుపాలెం యూపీ పాఠశాలను కొనసాగించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. నగరం కంటే గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలల్లో పదిమంది విద్యార్థుల కంటే తక్కువగా ఉండడంతో ఆచితూచి వ్యవహరించాలని కోరినట్టు తెలిసింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ అమలులోకి వస్తే ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు ప్రస్తుతం ఉన్న ఎస్జీటీలకు అదనంగా కొత్తగా నియమాకాలు చేపట్టాలని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. అదే సమయంలో ఉన్నత పాఠశాలల్లో స్కూల్‌ అసిస్టెంట్లు మిగులుతారని అంచనాకు వచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మేరకు కొత్త విధానం అమలులోనికి వస్తోందని భావిస్తున్నారు.

సవాళ్ల స్వారీ!

... 5వ పేజీ తరువాయి

ఒకే వేదికపైకి వారిని తీసుకువచ్చి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడమన్నది అంత సులభమైన విషయం కాదు. ఇందుకోసం ఆయన ప్రత్యేకంగా శ్రమించాల్సి ఉంటుంది. శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో ఆయన యాక్షన్‌ ప్లాన్‌ ఎలా ఉంటుందన్నది అత్యంత కీలకం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఉత్సవాల్లో భాగమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సిన బాధ్యత వీసీపై ఉంటుంది.

వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి

దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటి. అటువంటి ఏయూ ప్రతిష్ఠ గడిచిన కొన్నాళ్లుగా మంటగలిసింది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా మారిందన్న ఆరోపణలున్నాయి. అనేక మందికి అడ్డగోలుగా పదువులను కట్టబెట్టారు. కొన్ని కీలక నిర్ణయాలపైనా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వీసీ రాజశేఖర్‌ తీసుకునే నిర్ణయాలపై ఆసక్తి నెలకొంది. బాధ్యతలు తీసుకున్న రోజు ఆయన వ్యవహరించిన తీరు, ఉద్యోగులతో ఆయన మాట్లాడిన విధానం, చేసిన సూచనలు కొంత భిన్నంగా ఉండడంతో ఉద్యోగుల్లో కూడా ఒకరకమైన చర్చ మొదలైంది. ఈయనతో అంత ఈజీ కాదు.. అన్న భావన వ్యక్తమైంది. ఇదే తరహాలో వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేసే నిర్ణయాలను తీసుకుని ముందుకుసాగుతారా? అన్నది చూడాలి. అదే సమయంలో గత పాలకులు తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించి ప్రభుత్వానికి నిక్కచ్చిగా నివేదికలను అందిస్తారా.. లేదా.? అన్నది వేచి చూడాలి.

ర్యాంకుల పట్టాలెక్కించేనా.?

యూనివర్సిటీ పనితీరు అధ్వానంగా తయారవడంతో వర్సిటీ పనితీరు గణనీయంగా పడిపోయింది. దీంతో కీలక ర్యాంకులను సాధించడంలో ఏయూ పూర్తిగా వెనకబడిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతర్జాతీయ స్థాయిలో టాప్‌లో ఏయూ నిలవాలని ఆకాంక్షిస్తోంది. కనీసం జాతీయ స్థాయిలో అయినా ఏయూను టాప్‌లో నిలబెట్టేలా కొత్త వీసీ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ర్యాంకుల్లో వెనబడడానికి ప్రధానంగా పరిశోధనలు తగ్గడం, ఫ్యాకల్టీ కొరతగా కారణంగా ఉంది. అనేక విభాగాల్లో పరిశోధనలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ర్యాంకింగ్‌ ఫ్రేమ్‌ వర్క్‌ (ఎన్‌ఐ ఆర్‌ఎఫ్‌), నాక్‌లో మెరుగైన స్థానాలను సాధించడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలను తీసుకోవా. ఇందుకోసం ఆయన వీసీ ప్రణాళికలు ఎలా ఉంటాయన్నది కూడాఆసక్తిగా మారింది.

కోటరీలకు దూరంగా..

ఇప్పటివరకు యూనివర్సిటీకి వైస్‌ చాన్సలర్‌ ఎవరు వచ్చినా తనకంటూ ప్రత్యేకంగా ఒక కోటరీని ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇది వర్సిటీ పాలనపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఇటువంటి కోటరీలకు దూరంగా ఉండడం కూడా అత్యంత కీలకం. దీనివల్ల వర్సిటీ రాజకీయాలకు ఆయన దూరంగా ఉండడంతో పాటు కీలకమైన, కఠిన నిర్ణయాలను తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయంలో ఆయన ఎంత వరకు నిఖార్సుగా ఉంటారో చూడాలి. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా వీసీ ప్రమాణం చేయడాన్ని బట్టి చూస్తే.. కోటరీలకు అవకాశం ఉండదనే అందరూ భావిస్తున్నారు. తుదివరకు వీసీ ఇదే విధానాన్ని అనుసరిస్తే వర్సిటీ అభివృద్ధిలో కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఉండవని పలువురు పేర్కొంటున్నారు.

మసాజ్‌ ముసుగులో వ్యభిచారం

... 5వ పేజీ తరువాయి

ఉండాలి. సెంటర్‌ లోపల కూడా మసాజ్‌ చేసేందుకు మగవారికి వేరుగా, ఆడవారికి వేరుగా విభాగాలు ఉండాలి. మసాజ్‌ చేసే గదిలో టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు వేర్వేరుగా ఉండడంతో పాటు లోపల నుంచి అంతర్గత ద్వారాలు ఉండకూడదు. సెంటర్‌లోకి వెళ్లిన వారికి మసాజ్‌ గదిలో ఉన్నవారు, మసాజ్‌ గదిలో ఉన్నవారికి బయట ఉన్నవారు స్పష్టంగా కనిపించేలా అద్దాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మసాజ్‌ గదిని మూసి ఉంచకూడదు. అలాగే ఒక మసాజ్‌ సెంటర్‌లో పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపు కార్డులు, మహిళా భద్రత కోసం ప్రత్యేక మానిటరింగ్‌ సెల్‌ వంటివి అందుబాటులో ఉంచాలి. ప్రతి సెంటర్‌లో ఫిజియోథెరపిస్టు లేదా ఆక్యుప్రెజర్‌ లేదా ఆక్యుపేషనల్‌ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్‌ కోర్సు చేసిన వాళ్లను నియమించుకోవాలి.ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే సేవలందించాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను రికార్డు చేసేలా అన్నిచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం 3 నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్‌ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

మసాజ్‌ సెంటర్‌లోనే అన్ని సేవలు..

అయితే నగరంలోని కొన్ని మసాజ్‌ సెంటర్లలో విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన యువతులను నియమించుకుంటున్నారు. వారితో కస్టమర్లకు మసాజ్‌లు చేయిస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని సెంటర్ల నిర్వాహకులు మసాజ్‌ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. తమ వద్ద ఉద్యోగులుగా చెప్పుకునే యువతులతోనే వ్యభిచారం చేయిస్తున్నారు. ఒక్కో సేవకు ఒక్కో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. సాధారణ మసాజ్‌కు ఒక రేటు, క్రాస్‌ మసాజ్‌ (మగవారికి ఆడవారితో మసాజ్‌) కావాలనుకుంటే ఒక రేటు, శృంగారం చేయాలనుకుంటే మరొక రేటు ఉంటోంది. మసాజ్‌ కాకుండా ఇతర సేవలు ఏవైనా సరే ముందుగా రిసెప్షన్‌లో రూ.ఐదు వేలు చెల్లించాలి. మసాజ్‌ గదిలోకి వెళ్లిన తర్వాత మసాజ్‌ చేసే యువతితో గడపాలనుకుంటే ఆమెకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలు చెల్లించాల్సి ఉంటుంది. మసాజ్‌ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందని ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసినా సరే పోలీసులు దాడి చేయడానికి ముందే నిర్వాహకులకు సమాచారం చేరిపోతుంది. దీంతో పోలీసులు తనిఖీలకు వెళ్లేసరికే నిర్వాహకులు అప్రమత్తమై ఎలాంటి ఉల్లంఘనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగిన ఆనవాళ్లు లేకుండా సరిచేసేసుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట నగరంలోని స్పా సెంటర్లపై ఆకస్మిక తనిఖీలకు సీపీ ఆదేశించగా.. ఫోర్త్‌ టౌన్‌ పోలీసులు తమ పరిధిలోని ఒక స్పాలో తనిఖీ చేస్తుండగా అక్కడ ఒక ఎస్‌ఐ మఫ్టీలో పట్టుబడ్డారు. దీనిపై సీపీకి సమాచారం అందించడంతో సదరు ఎస్‌ఐను సస్పెండ్‌ చేయడం పోలీసులకు స్పా నిర్వాహకులతో సంబంధాలున్నాయనే అభిప్రాయాలకు బలాన్ని చేకూర్చినట్టయింది.

పోలీసులకు ప్రతినెలా రూ.15 లక్షల మామూళ్లు!

నగరంలోని మసాజ్‌ సెంటర్ల నుంచి కొంత మంది పోలీసులకు ప్రతినెలా రూ.15 లక్షల వరకు మామూళ్లుగా అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని 260 మసాజ్‌ సెంటర్లు ఉండగా... వీటిలో 50 సెంటర్లలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆయా సెంటర్ల నుంచి నెలకు రూ.పది వేలు, మిగిలిన సెంటర్ల నుంచి రూ.ఐదు వేల చొప్పున మామ్మూళ్లుగా పోలీస్‌ అధికారులకు అందుతున్నట్టు సమాచారం. ఈ వసూళ్లలో పోలీసులు నేరుగా తలదూర్చకుండా సిరిపురంలోని ఒక స్పా నిర్వాహకుడు, వీఐపీ రోడ్డులోని మరొక స్పా నిర్వాహకుడు, ప్రముఖ స్పాలో పనిచేసి బయటకు వచ్చి సొంతంగా సీతమ్మధారలో స్పా పెట్టుకున్న మరొకరు, గాజువాకలోని స్పా నిర్వాహకుడొకరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. వీరంతా నగరంలోని మసాజ్‌ సెంటర్ల నుంచి నెలవారీ డబ్బులు వసూలు చేసి తమకు సహకరించే పోలీసు అధికారులకు అందజేస్తున్నట్టు తెలుస్తుంది. అక్కడి నుంచి మసాజ్‌ సెంటర్లకు అండదండలు అందిస్తున్న ఇతర పోలీసులకు వాటాలు చేరిపోతున్నాయని పోలీస్‌ శాఖలోనే ప్రచారం జరుగుతోంది. అందుకే మసాజ్‌ సెంటర్‌లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే మామూళ్లు అందుకుంటున్న అధికారులు స్పా నిర్వాహకులకు ముందుగానే సమాచారం అందించి అప్రమత్తం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీపీగా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్పాల జోలికి పోలీసులు వెళ్లడం మానేసినా, గత కొద్ది రోజులుగా మళ్లీ కౌంటర్‌ తెరిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌ కేవీలో ఉద్యోగాలకు 4న ఇంటర్వ్యూలు

ఉక్కుటౌన్‌షిప్‌, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌ కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్‌ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ విభాగంలో ఇంగ్లిష్‌, హిందీ, గణితం, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్‌, ఎకనామిక్స్‌, కంప్యూటర్‌ సైన్స్‌ పోస్టులకు, టీజీటీ విభాగంలో ఆంగ్లం, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్‌, సోషల్‌, కంప్యూటర్‌ ఇన్‌స్ట్రక్టర్‌, స్పోర్ట్స్‌ కోచ్‌, క్రాఫ్ట్‌, యోగా, నర్స్‌ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు స్కూల్‌ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఆలయాల పునర్నిర్మాణానికి రూ.2.22 లక్షల విరాళం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం కాలనీలోని హైస్కూల్ మైదానంలో పునర్నిర్మిస్తున్న కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాల కోసం గొంతిన నూకరాజు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.రెండు లక్షల 22 వేలను విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయాల వద్ద జరిగిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి గుడివాడ లతీశ్ చేతులమీదుగా నూకరాజు కుమారులు గొంతిన శంకర్, సుధాకర్‌లు ఇందుకు సంబంధించిన నగదును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సంగ్రాన నూకరాజు, కె.సత్యారావు, ఎస్.ఆంజి, వరదాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలమాంబ జాతర



అగనంపూడి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్తుల ఆరాధ్య దేవత పోలమాంబ జాతరను సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరుపుతామని వారు పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకుని రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు కమిటీ ప్రతినిధి అట్టా సన్యాసి అప్పారావు తెలిపారు.

ఘనంగా బల్లల పండగ

అగనంపూడి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస రజక కాలనీలో బొర్రమాంబ రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజకుల కుల దైవం వడివేలు మాచిదేవ వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తోకాడ రాము, పి.సత్యనారాయణ, కె.రవి, గోవిందరావు, కాళిదాసు, రాజు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహరాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 35 దొండకాయలు 36, బంగాళదుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 26, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, గోరుచిక్కుడు 36, దేముడుచిక్కుడు 52, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్‌పెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210



సీతానగరం నుంచి హెచ్‌బీకాలనీకి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న యూజీడీ పైపులు



హెచ్‌బీ కాలనీ రోడ్డు పక్కన ఓ ఇంటి ప్రహరీని ఆనుకుని ఉన్న యూజీడీ పిట్స్..

నిరుపయోగంగా యూజీడీ పైపులు

- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- సామగ్రిని తరలించని అధికారులు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

పెదగంట్యాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీ పక్కన, పరిసరాల్లో గుట్టలుగా పేర్చిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ (యూజీడీ) పైపులు, పిట్స్ వల్ల స్థానికంగా నివారం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ఇవి ఇళ్లను చుట్టూ, ఇళ్ల ప్రహరీలను ఆనుకుని ఉండటం వల్ల ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. పెదగంట్యాడ ప్రాంతంలో యూజీడీ పైపు లైన్ల ఏర్పాటు నిమిత్తం ఇక్కడకు అధిక మొత్తంలో తెచ్చిన పిట్స్, పైపులను తరలించకపోవడం.. యూజీడీ పనులు నిలిచిపోవడం వంటి కారణాలతో ఇవి గుట్టలుగా పేరుకుపోయాయి. వీటిని నిల్వ చేసేందుకు నడుపూరు గెడ్డ పక్కన స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలమంతా వీటితో నిండిపోవడంతో మిగిలిపోయిన వాటిని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్లలో, గెడ్డ గట్టుపై, ఇతర ఖాళీ స్థలాల్లోనూ గుట్టలుగా చేర్చి చేతులు దులుపుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా వీటి గురించి పట్టించుకునే నాథులే కరువవ్వడంతో పైపులు, పిట్స్ చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి.

దీంతో పాములు, తేళ్లు వంటి విష కీటకాల సంచారం అధికమయాయయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిమార్లు ఇవి సరిసరాల్లోని ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని, దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యూజీడీ మెటీరియల్‌ను ఇక్కడ నుంచి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌన్సిల్‌లో సమస్యను ప్రస్తావిస్తా..



-గంధం శ్రీనివాసరావు, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్

యూజీడీ లైన్ల ఏర్పాటు కోసం పైపులు, పిట్స్ తెచ్చి హౌసింగ్ బోర్డు కాలనీ, పరిసరాల్లో గుట్టలుగా పేర్చి సుమారు పదేళ్లు అవుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ వారు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని తాము కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

స్టీల్‌ప్లాంట్ కేవీలో ఉద్యోగాలకు 4న ఇంటర్వ్యూలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ పోస్టులకు, టీజీటీ విభాగంలో ఆంగ్లం, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, క్రాఫ్ట్, యోగా, నర్స్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు స్కూల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

కూర్మన్నపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండలం దాసర పేట సమీపంలో జూదం ఆడుతున్నారన్న ముందస్తు సమాచారంతో ఆదివారం రాత్రి దువ్వాడ పోలీసులు దాడి చేసి, ముగ్గురిని అదుపు లోనికి తీసుకొని, వారి వద్ద నుండి రూ.23,000 నగదును, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7 నుంచి టౌన్‌షిప్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-1లో గల వేంకటేశ్వరస్వామి ఆలయ 34వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా 7న అంకురార్పణ, 8న ధ్వజారోహణం, 9న వైదిక సదస్యం, సుదర్శన హోమం, పండిత సదస్యం, 10న లక్ష తులసీపూజ, 11న లక్ష కుంకుమార్చన, 12న ధ్వజారోహణం, చక్రస్నానం, పుష్పయాగం, ఊంజల్ సేవ జరుగుతాయని పేర్కొన్నారు.

వసతులు కల్పించాలని టిడ్కో లబ్ధిదారుల ఆందోళన

పెదగంట్యాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ, భానోజీతోట ప్రాంతాల్లోని టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం గృహ సముదాయాల వద్ద ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా జరిగి సమావేశంలో సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాలకు ప్రాథమిక వసతులైన తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు వంటి సౌకర్యాలు కల్పించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. టిడ్కో గృహాలకు కనీస వసతులు లేక లబ్ధిదారులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్నారు. నాయకులు జి.ఆనంద్, వనజాక్షి, నాయకులు కృష్ణారావు, తిరుమలరావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కుడో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో విద్యార్థులకు సర్టిఫికెట్లు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల అన్ని రంగాలలోనూ రాణిస్తారని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో ఆదివారం కుడో బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శరీర దృఢత్వానికి, రక్షణకు ఇటువంటి శిక్షణ చాలా ముఖ్యమన్నారు. కుడో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శశిధర్, సభ్యులు ఎ.కిరణ్‌కుమార్, తులసీరావు, యశ్వంత్, కార్మిక నాయకుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

పెదగంట్యాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బొజ్జన్నకొండ వద్ద ఈ నెల 9న జరగనున్న బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ కోరారు. ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జంక్షన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో బర్మా, కంబోడియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు పాల్గొంటారన్నారు.

జీవీఎంసీ స్థలంలో ప్రైవేటు స్కూల్ నిర్మాణంపై హైకోర్టు స్టే

గాజువాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వినాయకనగర్ వుడాకాలనీలో ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు కొంత స్థలంతో పాటు భవనాన్ని వీఎంఆర్‌డీఏ నిర్మించటంపై హైకోర్టు స్టే విధించింది. ఈకాలనీ వాసుల అవసరాల నిమిత్తం కేటాయించిన సుమారు ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని ప్రైవేట్ పాఠశాలకు కేటాయించటంపై వినాయకనగర్ వుడా కాలనీ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. వీఎంఆర్‌డీఏ ఆ భవనాన్ని పాఠశాలకు లీజుకు ఇస్తున్నట్టు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని అసోసియేషన్ ప్రతినిధులు ఆ పిటిషన్‌లో కోరారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు వీఎంఆర్‌డీఏ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ప్రజా ప్రయోజనార్థం కేటాయించిన స్థలాలను ఇతర అవసరాలకు ఉపయోగించరాదని, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు హైకోర్టు ఈ స్టే ఇచ్చింది. అలాగే, కాలనీ లే అవుట్ వేసిన సమయంలో అప్పటి వుడా సంస్థ సుమారు ఐదెకరాల స్థలాన్ని కాలనీ వాసుల భవిష్యత్తు అవసరాల నిమిత్తం కేటాయించింది. ఆ స్థలంలో కొన్ని దుకాణాల సముదాయలుండడం, అప్పట్లో వుడా యాజమాన్యం ఆదర్శ స్కూల్‌కు 33ఏళ్ల లీజుకు ఇచ్చింది. ఆ దుకాణ సముదాయాల్లోనే ఈ స్కూల్ కొనసాగుతోంది. 33 ఏళ్ల లీజు పూర్తవటంతో పాఠశాలను ఇక్కడ నుంచి తరలించాలని కాలనీ సంక్షేమ సంఘం వీఎంఆర్‌డీఏపై ఒత్తిడి తీసుకువచ్చింది. ఈ పాఠశాలను తరలింపుపై వీఎంఆర్‌డీఏ కూడా ఆదేశాలు జారీచేసిందని, అయితే పాఠశాలను తరలించకపోగా ఆరేళ్ల క్రితం లే అవుట్‌లో మరో చోట ఉన్న ఎకరంన్నర స్థలాన్ని అదే పాఠశాలకు కేటాయించటం, అక్కడ కూడా వీఎంఆర్‌డీఏ భవనం నిర్మాణం చేపట్టడాన్ని కాలనీ సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఈ నిర్మాణ పనులు నిలిచిపోగా, తాజాగా నెల రోజుల నుంచి నిర్మాణ పనులు పూర్తి చేసి కొత్త భవనంలోకి పాఠశాలను తరలించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఈ పరిస్థితుల్లో కాలనీ సంఘం హైకోర్టును ఆశ్రయించటంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.



వినాయకనగర్ వుడా కాలనీలో నిర్మితమవుతున్న ఆదర్శ స్కూల్ నూతన భవనం

కాంగో డ్రమ్స్ వితరణ



రజక కాలనీ చిన్నారులకు కాంగో డ్రమ్స్‌ను బహూకరించిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడాకాలనీ దరి రజక కాలనీలోని చిన్నారులకు కాంగో డ్రమ్స్‌ను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదివారం బహూకరించారు. ఇటీవల జరిగిన బల్లల పండుగలో అద్భుతంగా డప్పులు వాయించిన ఈ చిన్నారుల ప్రతిభను గుర్తించి ఈ డ్రమ్స్ అందజేశారు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో జీవనోపాధికి వీలుగా రూ.40 వేలు విలువ చేసే డ్రమ్స్‌ను అందించినట్టు శ్రీధర్ తెలిపారు. దీంతో రజక సంఘ సభ్యులు, బృందం సభ్యులు శ్రీధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం సోదరులు

గోపాలపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కావడంతో ముస్లింలు ఉపావాస దీక్షలు ప్రారంభించారు. గోపాలపట్నంలోని తాహా మసీదు, కొత్తపాలెంలోని నూరానియా మసీదు, నందమూరినగర్‌లోని ఉమర్ సుల్తాన్ మసీదుల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రంజాన్ నెలను పురస్కరించుకుని మసీదుల్లో ప్రతిరోజూ ఐదు వేళలల్లో ఆచరించే నమాజులతో పాటు రంజాన్ నెలలో రాత్రి వేళలో ఆచరించే తరావీ నమాజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించే సమయంలో మసీదుల్లో నిర్వహించే ఇఫ్తార్‌కు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొనడంతో మసీదుల్లో పండుగ వాతావరణ నెలకొంటుంది.

వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వేపగుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన శ్రీ కల్యాణ వెంకన్న 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రంలో భక్తులు కల్యాణ వెంకన్న ఆలయ జెండాలను చేతబూని జై శ్రీమన్నారాయణ అంటూ రవినగర్, వెంకటసాయినగర్, అప్పలనర్సయ్యకాలనీ, బంటాకాలనీల మీదుగా సాగారు. అనంతరం పాంచాహ్నిక దీక్షాధారణం, పుట్ట బంగారం సేకరణ, ఉభయదారులుకు కంకణధారణ, మంగళశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బండారు ప్రసాద్, ఆలయ అర్చకులు శ్రీనివాస స్వామి, ఆదినారాయణ, భాను, శ్రీహరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

భూలోకమాంబ పరస ఉత్సవం

గ్రేటర్ 98వ వార్డు అప్పన్నపాలెంలోని భూలోకమాంబ పరస మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి తెల్లవారు జామున నుంచి పసుపునీళ్లతో అభిషేకాలు, అర్చనలు, పూలాభిషేకం, వివిధ పిండివంటలతో నివేదన పూజలు చేశారు. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్; కోలాటం, సాముగారిడి, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వెంకటాద్రిపై లక్ష్మీ పూజలు



అలంకరణలో లక్ష్మీదేవి

పెందుర్తి; వెంకటాద్రి శిఖరంపైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి శ్రీసూక్త సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టు విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ముందుగా వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

సభ్యుల సొంతింటి కలను నిజం చేస్తాం

భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటరావు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యుల సహకారంతో ఫేజ్-3 సభ్యుల పాతికేళ్ల సొంతింటి కలను త్వరలోనే నిజం చేస్తామని భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ కళాభారతిలో ఆదివారం జరిగిన సొసైటీ ఫేజ్-3 సభ్యుల సమావేశంలో పాలకవర్గం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి అంశాలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. గృహ నిర్మాణాల కోసం బ్యాంకులతో జరిపిన చర్చలతో పాటు సభ్యుల వాయిదాల చెల్లింపు అంశాలను వివరించారు. గత పాలకవర్గం హయంలో జరిగిన సుమారు రూ.మూడు కోట్ల నిధుల గల్లంతు విషయమై సభ్యుల సూచన మేరకు బోర్డు ట్రిబ్యునల్‌లో కేసు వేయడం జరిగిందన్నారు. పాలకవర్గం ప్రకటించిన అంశాలకు సభ్యులు మద్దతు పలికారు. సమావేశంలో పాలకవర్గ డైరెక్టర్లు శుభాకర్ సాహు, పీవీఎస్ రాజు, పి.భాస్కరరావు, వీఎస్ఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక హైస్కూల్‌కు కుర్చీలు అందజేత

గాజువాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక హైస్కూల్‌లో 1990-91 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 కుర్చీలను ఆదివారం ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతికి వితరణగా అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలనే సంకల్పంతో కుర్చీలు అందజేస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు తాము అండగా నిలుస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, పూర్వ విద్యార్థులు చట్టి గోపి, నర్సింగ్ బాలకుమార్, కృష్ణారెడ్డి, నూకరాజు, రామకృష్ణ, షకీల, తదితరులు పాల్గొన్నారు.

'ప్రాథమిక వసతుల కల్పనకు పెద్దపీట'



అశోక్‌నగర్‌లోని ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

పెదగంట్యాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని అశోక్‌నగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, ప్రజారోగ్యం వంటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తామని, రూ.22 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని, కొండవాలు ప్రాంత నివాసులకు పూర్తి స్థాయిలో తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకోసం రూ.80 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీధి దీపాలు వెలగకపోతే తమ దృష్టికి తేవాలని స్థానికులకు సూచించారు. నాయకులు బసా వెంకటస్వామి రెడ్డి, పిడుగు అప్పారావు, రుత్తల శ్రీను, రెడ్డిపల్లి ఆనంద్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

60 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న కళింగ వైశ్య సంఘ సభ్యులు

గోపాలపట్నం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కొత్తపాలెం సంతోష్‌నగర్ కాలనీలోని సంఘం సామాజిక భవనంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 68 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పి.మౌర్యసింహ, బి.విజయ్ కుమార్, డి.సురేశ్, సంస్థ ప్రతినిధులు జి.మధుసూధనరావు, జగదీశ్, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల సేవలు ప్రశంసనీయం



బ్రహ్మకుమారీలను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్ శరగడం

పెందుర్తి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయం అని మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు పేర్కొన్నారు. పెందుర్తిలోని ఎల్ఐసీ కాలనీలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. శాంతి, ప్రేమ, పరమత సహనం తదితర సద్గుణాలకు ప్రతీక బ్రహ్మకుమారీలన్నారు. ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం అన్నారు. ముందుగా రాజయోగ సాధనను బ్రహ్మకుమారీ భవాని వివరించారు. అనంతరం శివుడే దేవుడు అన్న మెమెంటోలు అందజేశారు.

యూటీఎస్ యాప్‌పై స్పెషల్ డ్రైవ్

- మొబైల్ టికెట్ బుకింగ్‌పై ప్రయాణికులకు విస్తృతంగా అవగాహన
- డిజిటల్ చెల్లింపులతో కాగిత రహిత టికెటింగ్ లక్ష్యంగా ప్రక్రియ

విశాఖపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యూటీఎస్ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ మొబైల్ టికెట్ బుకింగ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు వాల్తేరు రైల్వే స్పెషల్ డ్రైవ్‌లను విస్తృతం చేసింది. విశాఖ రైల్వే స్టేషన్‌తో పాటు విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, రాయగడ స్టేషన్లలో ఆదివారం అవగాహన సదస్సులు నిర్వహించింది. అలాగే పోస్టర్లు, బ్యానర్లను ఏర్పాటు చేయడమే కాకుండా యూటీఎస్ యాప్‌ను యాక్సెస్ చేయడానికి క్యూఆర్ కోడ్‌లను అధికారులు అందుబాటులో ఉంచారు. ఈ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా వినియోగించాలి అనే అంశాలకు సంబంధించి ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా యూటీఎస్ మొబైల్ యాప్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ ఆర్-వాలెట్ ద్వారా జరిగే టికెట్ బుకింగ్ లావాదేవీలపై ఆగస్టు 24 వరకు మూడు శాతం క్యాష్ బ్యాక్‌ను రైల్వే శాఖ అందిస్తోంది.

డిజిటల్ చెల్లింపుల ద్వారా కాగిత రహిత టికెటింగ్‌ను పూర్తి స్థాయిలో ప్రయాణికులకు అందించే సదుపాయంలో భాగంగా యూటీఎస్ యాప్‌ను వాల్తేరు డివిజన్ లక్ష్యంగా ముందుకు సాగుతోందని సీనియర్ డీసీఎం కె.సందీప్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యూటీఎస్ యాప్‌పై ప్రయాణికులలో అవగాహన కల్పించేందుకు స్టేషన్లలో, ప్లాట్‌ఫామ్‌లపై వివిధ మాధ్యమాల ద్వారా యాప్‌ను వినియోగించే విధానాన్ని ప్రచారం చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ వల్ల డిజిటల్ చెల్లింపులు వేగవంతంగా జరుగుతాయని, రైల్వే కౌంటర్ల వద్ద టికెట్ కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం ఉండదని ఆయన స్పష్టం చేశారు. అలాగే యూటీఎస్ యాప్ ద్వారా చెల్లింపులో చిల్లర సమస్య తలెత్తదని, ప్లాట్‌ఫామ్ టికెట్‌తో పాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా మొబైల్ ద్వారా సులభంగా టికెట్ పొందవచ్చునని తెలిపారు.



మొబైల్ టికెట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు



విశాఖపట్నం స్టేషన్‌లో డిజిటల్ చెల్లింపులతో టిక్కెట్ ఇస్తున్న దృశ్యం

సవాళ్ల స్వారీ!

... 5వ పేజీ తరువాయి

ఒకే వేదికపైకి వారిని తీసుకువచ్చి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడమన్నది అంత సులభమైన విషయం కాదు. ఇందుకోసం ఆయన ప్రత్యేకంగా శ్రమించాల్సి ఉంటుంది. శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఆయన యాక్షన్ ప్లాన్ ఎలా ఉంటుందన్నది అత్యంత కీలకం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఉత్సవాల్లో భాగమయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాల్సిన బాధ్యత వీసీపై ఉంటుంది.

వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి..

దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటి. అటువంటి ఏయూ ప్రతిష్ఠ గడిచిన కొన్నాళ్లుగా మంటగలిచింది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా మారిందన్న ఆరోపణలున్నాయి. అనేక మందికి అడ్డగోలుగా పదువులను కట్టబెట్టారు. కొన్ని కీలక నిర్ణయాలపైనా విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వీసీ రాజశేఖర్ తీసుకునే నిర్ణయాల పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. బాధ్యతలు తీసుకున్న రోజు ఆయన వ్యవహరించిన తీరు, ఉద్యోగులతో ఆయన మాట్లాడిన విధానం, చేసిన సూచనలు కొంత భిన్నంగా ఉండడంతో ఉద్యోగుల్లో కూడా ఒకరకమైన చర్చ మొదలైంది. ఈయనతో అంత ఈజీ కాదు.. అన్న భావన వ్యక్తమైంది. ఇదే తరహాలో ఉంటూ వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేసే నిర్ణయాలను తీసుకుని ముందుకు సాగుతారా.? అన్నది చూడాలి. అదే సమయంలో గత పాలకులు తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించి ప్రభుత్వానికి నిక్కచ్చిగా నివేదికలను అందిస్తారా.. లేదా.? అన్నది వేచి చూడాలి.

ర్యాంకుల పట్టాలెక్కించేనా.?

యూనివర్సిటీ పనితీరు అధ్వానంగా తయారవ్వడంతో వర్సిటీ పనితీరు గణనీయంగా పడిపోయింది. దీంతో కీలక ర్యాంకులను సాధించడంలో ఏయూ పూర్తిగా వెనకబడిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతర్జాతీయ స్థాయిలో టాప్‌లో ఏయూ నిలవాలని ఆకాంక్షిస్తున్నారు. కనీసం జాతీయ స్థాయిలో అయినా ఏయూను టాప్‌లో నిలబెట్టేలా కొత్త వీసీ ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ర్యాంకుల్లో వెనబడడానికి ప్రధానంగా పరిశోధనలు తగ్గడం, ఫ్యాకల్టీ కొరతగా కారణంగా ఉంది. అనేక విభాగాల్లో పరిశోధనలను పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్), నాక్‌లో మెరుగైన స్థానాలను సాధించడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలను తీసుకోవా. ఇందుకోసం ఆయన వీసీ ప్రణాళికలు ఎలా ఉంటాయన్నది కూడా ఆసక్తిగా మారింది.

కోటరీలకు దూరంగా..

ఇప్పటివరకు యూనివర్సిటీకి వైస్ చాన్సలర్ ఎవరు వచ్చినా తనకంటూ ప్రత్యేకంగా ఒక కోటరీని ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నారు. ఇది వర్సిటీ పాలనపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఇటువంటి కోటరీలకు దూరంగా ఉండడం కూడా అత్యంత కీలకం. దీనివల్ల వర్సిటీ రాజకీయాలకు ఆయన దూరంగా ఉండడంతో పాటు కీలకమైన, కఠిన నిర్ణయాలను తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఈ విషయంలో ఆయన ఎంతవరకు నిఖార్సుగా ఉంటారో చూడాలి. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా వీసీ ప్రమాణం చేయడాన్ని బట్టి చూస్తే కోటరీలకు అవకాశం ఉండదని అందరూ భావిస్తున్నారు. తుది వరకు వీసీ ఇదే విధానాన్ని అనుసరిస్తే మాత్రం వర్సిటీ అభివృద్ధిలో కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని పలువురు పేర్కొంటున్నారు.

గ్రూప్ ల్యాండ్ సర్టిఫికేషన్ రద్దు దారుణం

కార్పొరేటర్ మూర్తియాదవ్



సీతంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో గ్రూప్ ల్యాంక్ సర్టిఫికేషన్ రద్దు చేయడం దారుణమని, దీనికి వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణమని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 13 బీచ్‌లకే గ్రూప్‌ల్యాండ్ సర్టిఫికేషన్ ఉందని, చంద్రబాబునాయుడు 2018లో రూ.7 కోట్లతో గ్రూప్ ల్యాండ్ సర్టిఫికేషన్ కావాలని ప్రతిపాదన పెడితే 2020లో మంజూరు చేశారని చెప్పారు. వ్యర్థాలు తొలగించడంలో, వాష్ రూమ్స్ మెయింటెన్స్ సరిగ్గా లేకుండా వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం మారినప్పటికీ, అధికారుల తీరు మారలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాత్ర నివాస్ పునర్‌నిర్మాణంలో కూడా అక్రమాలు జరిగాయని, టూరిజం నాశనం చేసిన వారిపై పోరాటం చేస్తామని ఆయన చెప్పారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



స్వతహాగా రూపొందించిన నమూనాలతో విద్యార్థులు

అక్కయ్యపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు పరిధిలోని శంకువానిపాలెం వాగ్దేవి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని యూఎస్ఏకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లాడ రాజశేఖర్ ప్రారంభించారు. భారతావని రక్షించే విధంగా భవిష్యత్ తరానికి శాస్త్రవేత్తలుగా విద్యార్థులు తయారుకావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కాగా ఒకటి నుంచి పదో తరగతి వరకు చెందిన విద్యార్థులు ప్రకృతికి హాని కలిగించకుండా పర్యావరణాన్ని పరిరక్షించేలా సౌర విద్యుత్‌శక్తి, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, తాగునీరు, వ్యవసాయం, జాతీయ చిహ్నాలను, విభిన్న అంశాలతో కూడిన వివిధ రకాల 60 నమూనాలను ప్రదర్శించి ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్‌శైలజ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ.రాజశేఖర్ పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహించాలి

మహారాణిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హస్త కళాకారులను ప్రోత్సహించాలని ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎం.విశ్వ కోరారు. మహారాణిపేట రామ్‌నగర్‌లోని లేపాక్షి ఎంపోరియంను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలు, ప్రత్యేక దినాల్లో హస్త కళాకారులు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. తద్వారా వారిని ఆదుకోవాలని కోరారు

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షకు హైస్కూల్ విద్యార్థులు

అక్కయ్యపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఎ-సర్టిఫికెట్ పరీక్షకు ఆదివారం తరలివెళ్లారు. ఈ పరీక్ష షీలానగర్‌లోని ఏపీఈఈవీఎం పాఠశాలలో జరిగింది. ఆంధ్ర ట్రూప్ కమాండర్ ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్ ఎన్‌వీ విశ్వనాథం ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్ష పేపర్ మొత్తం 350 మార్కులకు ఉంటుందని, 175 మార్కులు సాధిస్తే వివిధ ప్రవేశ పరీక్షల్లో ప్రాధాన్యతతో పాటు ఆర్మీలో చేరేందుకు కూడా ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీనరస, బుల్లయ్య కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బ్రహ్మానందరెడ్డి, నేతాజీ పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ నిర్వహణ పనులతో అవస్థలు

మురళీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ నిర్వహణ పనులతో జనాలకు తలనొప్పులు తప్పడం లేదు. ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో మాధవధార, మర్రిపాలెం, ఉడాకాలనీ ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేసిచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయిన తర్వాత వ్యర్థాలను రోడ్లపైనే వదిలేశారు. వీటి తొలగింపు, విద్యుత్ శాఖదా ? లేక జీవీఎంసీ పారిశుధ్య విభాగానిదో తెలియడం లేదు. ఇలా ఇరు శాఖల సమన్వయ లోపం జనాలకు శాపంగా మారింది. 51వ వార్డు కళింగనగర్ ప్రాంతంలో దుకాణం ఎదుట ఈ వర్థాలను పడేశారు. దీంతో యజమాని ఆయన షాపును మూసివేయాల్సి వచ్చింది. రోజుల తరబడి పలుచోట్ల ఇలా వ్యర్థాలను వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. స్థానిక సచివాలయ సిబ్బందికి, జీవీఎంసీ శానిటరీ విభాగం అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.



రోడ్డుపై వదిలివేసిన చెట్ల కొమ్మలు

నీటి సరఫరా విభాగానికి శాశ్వత భవనం

మురళీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీలో నిరంతర నీటి సరఫరా విభాగానికి శాశ్వత భవనం మంజూరు చేశారు. ఆర్టీఏ కార్యాలయ మార్గంలో జీవీఎంసీ స్థలం కేటాయించడంతో పనులు ఆరంభించారు. ఇకపై జీవీఎంసీ తాగునీటి విభాగం సమన్వయంతో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సిసి) ఇంజనీర్లు, ప్రాజెక్టు బృందం 'స్కాడా' పేరిట కొత్త భవనం పూర్తయ్యాక అక్కడి నుంచి విధులు చేపడతారు. ఏడీబీ నిధులతో పనులు ఆరంభించారు. రైవాడ నుంచి నీటిని సరఫరా చేసేలా పైలట్ స్కీమ్ కింద ఉత్తర నియోజకవర్గం, పశ్చిమంలో ని కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభించారు. రూ.395 కోట్లతో ఆరంభించిన ఈ నీటి సరఫరా పనులు దాదాపు పూర్తి కావచ్చినట్లు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రామరాజు తెలిపారు. నిరంతర నీటి సరఫరాకు ఆరు చోట్ల ట్యాంకులు నిర్మించారు. లైన్ల ఏర్పాటు దాదాపు పూర్తయ్యింది. పశ్చిమంలో వేపగుంట ప్రాంతంలో లైన్లను అమర్చాల్సి ఉందని తెలిపిన ప్రాజెక్ట్ మేనేజరు, లో లెవెల్ వాటర్ ట్యాంకు కంచరపాలెం ఆర్పీపేట వద్ద పూర్తి కావాల్సి ఉందన్నారు. మాధవధారలో చేపట్టిన కొత్త ట్యాంకు పనులు దాదాపు పూర్తయ్యాయి. రైవాడ మెయిన్ లైన్ నుంచి విశాఖ ఉత్తరం, పశ్చిమ ప్రాంతాల్లో ఇంటింటికీ కనెక్షన్లు పూర్తి చేసి నీరు అందిస్తామన్నారు. ఇప్పుడు ప్రయోగాత్మకంగా నీటిని సరఫరా చేస్తున్నామని, ఎప్పుడు కొళాయి తిప్పినా నీరు వస్తుందని తెలిపారు. కొత్త భవనంలో 28 మంది విధుల్లో ఉంటారని తెలిపారు.



భవన నిర్మాణానికి ప్రారంభించిన పనులు

'మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి'

మహారాణిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ చిన రహమాన్ చెప్పారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2025 బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమం కోసం రూ.5434 కోట్లు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటానికి ఈ బడ్జెట్ దోహదపడుతుందన్నారు. షాదీఖానాలకు నిధులు కేటాయించి ఆనందకరమన్నారు. రాష్ట్ర చరిత్రలోనే అల్ప సంఖ్యాక వర్గాల వారి కోసం రూ.5434 కోట్లు బడ్జెట్ కేటాయించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఇందుకు కషి చేసిన న్యాయ శాఖా మంత్రి ఫరూక్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

విశాఖపట్నం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా పరిషత్ కార్యాలయానికి సమీపంలో ఉన్న పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.దివ్య ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శిగా అజయ్‌కుమార్ యాదవ్, కోశాధికారిగా రామ్ దిలీప్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.శ్రీనివాసరావు వ్యవహరించారు.



ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గ ప్రతినిధులు

'క్రమశిక్షణకు మారు పేరు వాకర్స్ క్లబ్'

మురళీనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) ; క్రమశిక్షణకు వాకర్స్ క్లబ్ మారు పేరుగా నిలుస్తున్నదని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సెయింట్ ఆన్స్ మల్కాపురం మహిళా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈపీఎస్.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మురళీనగర్ వాకర్స్‌క్లబ్ ప్రతి నిర్ణయాలు సిటీలో మిగతా క్లబ్స్‌కు మార్గదర్శకంగా ఉంటున్నాయన్నారు. క్లబ్ అధ్యక్షులు భానుప్రకాశ్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ జి.రామకృష్ణ, మురళీనగర్ వాకర్స్ క్లబ్ సిహెచ్ఎస్ఎస్‌వీ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీట్‌లను తొలగించేలా నడుచుకోండి

సీతమ్మధార, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రవర్తనతో గొడవలకు దూరంగా ఉంటే రౌడీషీట్‌లు తొలగిస్తారని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్, ద్వారకా పోలీసు స్టేషన్ సీఐలు సత్యనారాయణ, రమణ పేర్కొన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు స్టేషన్‌ల పరిధిలో సుమారు 40 మందికిపైగా రౌడీషీట్ కలిగిన వారు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. మంచి బుద్ధితో ప్రవర్తిస్తున్నామని, చక్కగా పనులు చేసుకుంటున్నామని ఈ సందర్భంగా వారు సీఐలకు వివరించారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠినమైన చర్యలు తప్పవని సీఐలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండు పోలీసు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

గురువుల విజేత ఎవరో!

... 5వ పేజీ తరువాయి

ఏజెంట్ పాసులు జారీ చేశారు.

గెలుపుపై అభ్యర్థుల్లో ధీమా

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది పోటీచేశారు. వీరిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే ప్రధాన పోటీ నెలకొందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రఘువర్మకు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన పార్టీలు, గాదె శ్రీనివాసులనాయుడుకి బీజేపీలో వుండే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు మద్దతు పలికారు. విజయగౌరి మద్దతుగా సీపీఎంతో పాటు కొన్ని వామపక్షాలు పని చేశాయి.

జనసేన పార్టీలో చేరికలు

సీతంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 32వ వార్డుకు చెందిన వ్యాపారవేత్త ఇనకోటి కొండలరావు పలువురు నాయకులతో కలిసి ఆదివారం జనసేన పార్టీలో చేరారు. గ్రేటర్ విశాఖ 25వ వార్డులోని సీతంపేట రాజేంద్రనగర్ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే మార్చి 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పార్టీలో అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 32వ వార్డులోని వివిధ కూలాలకు చెందిన సుమారు 500 మంది జనసేనలో చేరినట్టు వ్యాపారవేత్త కొండలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌడవాడ వరహాలనాయుడు, ఆళ్ల అచ్చిబాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మసాజ్ ముసుగులో వ్యభిచారం

... 5వ పేజీ తరువాయి

ఉండాలి. సెంటర్ లోపల కూడా మసాజ్ చేసేందుకు మగవారికి వేరుగా, ఆడవారికి వేరుగా విభాగాలు ఉండాలి. మసాజ్ చేసే గదిలో టాయ్‌లెట్లు, బాత్‌రూమ్‌లు వేర్వేరుగా ఉండడంతో పాటు లోపల నుంచి అంతర్గత ద్వారాలు ఉండకూడదు. సెంటర్‌లోకి వెళ్లిన వారికి మసాజ్ గదిలో ఉన్నవారు, మసాజ్ గదిలో ఉన్నవారికి బయట ఉన్నవారు స్పష్టంగా కనిపించేలా అద్దాలను మాత్రమే ఏర్పాటు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మసాజ్ గదిని మూసి ఉంచకూడదు. అలాగే ఒక మసాజ్ సెంటర్‌లో పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్నట్టయితే వారందరికీ గుర్తింపు కార్డులు, మహిళా భద్రత కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ వంటివి అందుబాటులో ఉంచాలి. ప్రతి సెంటర్‌లో ఫిజియోథెరపిస్టు లేదా ఆక్యుప్రెజర్ లేదా అక్యుపేషనల్ థెరపీలో డిగ్రీ, డిప్లొమా లేదంటే సర్టిఫికెట్ కోర్సు చేసిన వాళ్లను నియమించుకోవాలి. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మాత్రమే సేవలందించాలి. అలాగే సెంటర్‌కు వచ్చే వినియోగదారులకు అందించే సేవలను రికార్డు చేసేలా అన్నిచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం మూడు నెలల ఫుటేజీ స్టోరేజీ ఉండేలా హార్డ్ డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

మసాజ్ సెంటర్‌లోనే అన్ని సేవలు..

అయితే నగరంలోని కొన్ని మసాజ్ సెంటర్లలో విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన యువతులను నియమించుకుంటున్నారు. వారితో కస్టమర్లకు మసాజ్‌లు చేయిస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని సెంటర్ల నిర్వాహకులు మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. తమ వద్ద ఉద్యోగులుగా చెప్పుకునే యువతులతోనే వ్యభిచారం చేయిస్తున్నారు. ఒక్కో సేవకు ఒక్కో రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. సాధారణ మసాజ్‌కు ఒక రేటు, క్రాస్ మసాజ్ (మగవారికి ఆడవారితో మసాజ్) కావాలనుకుంటే ఒక రేటు, శృంగారం చేయాలనుకుంటే మరొక రేటు ఉంటోంది. మసాజ్ కాకుండా ఇతర సేవలు ఏవైనా సరే ముందుగా రిసెప్షన్‌లో రూ.ఐదు వేలు చెల్లించాలి. మసాజ్ గదిలోకి వెళ్లిన తర్వాత మసాజ్ చేసే యువతితో గడపాలనుకుంటే ఆమెకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలు చెల్లించాల్సి ఉంటుంది. మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతోందని ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసినా సరే పోలీసులు దాడి చేయడానికి ముందే నిర్వాహకులకు సమాచారం చేరిపోతుంది. దీంతో పోలీసులు తనిఖీలకు వెళ్లేసరికే నిర్వాహకులు అప్రమత్తమై ఎలాంటి ఉల్లంఘనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగిన ఆనవాళ్లు లేకుండా సరిచేసేసుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట నగరంలోని స్పా సెంటర్లపై ఆకస్మిక తనిఖీలకు సీపీ ఆదేశించగా.. ఫోర్త్ టౌన్ పోలీసులు తమ పరిధిలోని ఒక స్పాలో తనిఖీ చేస్తుండగా అక్కడ ఒక ఎస్ఐ మఫ్టీలో పట్టుబడ్డారు. దీనిపై సీపీకి సమాచారం అందించడంతో సదరు ఎస్ఐను సస్పెండ్ చేయడం పోలీసులకు స్పా నిర్వాహకులతో సంబంధాలున్నాయనే అభిప్రాయాలకు బలాన్ని చేకూర్చినట్టయింది.

పోలీసులకు ప్రతి నెలా రూ.15 లక్షల మామూళ్లు!

నగరంలోని మసాజ్ సెంటర్ల నుంచి కొంత మంది పోలీసులకు ప్రతినెలా రూ.15 లక్షల వరకు మామూళ్లుగా అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని 260 మసాజ్ సెంటర్లు ఉండగా... వీటిలో 50 సెంటర్లలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్టు పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆయా సెంటర్ల నుంచి నెలకు రూ.పది వేలు, మిగిలిన సెంటర్ల నుంచి రూ.ఐదు వేల చొప్పున మామూళ్లుగా పోలీస్ అధికారులకు అందుతున్నట్టు సమాచారం. ఈ వసూళ్లలో పోలీసులు నేరుగా తలదూర్చకుండా సిరిపురంలోని ఒక స్పా నిర్వాహకుడు, వీఐపీ రోడ్డులోని మరొక స్పా నిర్వాహకుడు, ప్రముఖ స్పాలో పనిచేసి బయటకు వచ్చి సొంతంగా సీతమ్మధారలో స్పా పెట్టుకున్న మరొకరు, గాజువాకలోని స్పా నిర్వాహకుడొకరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. వీరంతా నగరంలోని మసాజ్ సెంటర్ల నుంచి నెలవారీ డబ్బులు వసూలు చేసి తమకు సహకరించే పోలీసు అధికారులకు అందజేస్తున్నట్టు తెలుస్తుంది. అక్కడి నుంచి మసాజ్ సెంటర్లకు అండదండలు అందిస్తున్న ఇతర పోలీసులకు వాటాలు చేరిపోతున్నాయని పోలీస్ శాఖలోనే ప్రచారం జరుగుతోంది. అందుకే మసాజ్ సెంటర్‌లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే మామూళ్లు అందుకుంటున్న అధికారులు స్పా నిర్వాహకులకు ముందుగానే సమాచారం అందించి అప్రమత్తం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీపీగా శంఖబ్రత బాగ్చి బాధ్యతలు చేపట్టిన తర్వాత స్పాల జోలికి పోలీసులు వెళ్లడం మానేసినా, గత కొద్ది రోజులుగా మళ్లీ కౌంటర్ తెరిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మధురానగర్‌లో చోరీ

- 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణ

సీతంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలోని మధురానగర్‌లో చోరీ జరిగింది. ఒక ఇంటి తలుపులు పగలగొట్టి లోపల బీరువాలోలో ఉన్న 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దొంగలు దోచుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సీతంపేట మధురానగర్‌లోని రాధమాదవ్ టవర్స్ మొదటి అంతస్తులో కె.కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఒక కార్ల షోరూమ్‌లో మేనేజర్‌గా చేస్తున్న కృష్ణ, శనివారం ఉదయం కాకినాడలోని బంధువుల ఇంటికి కుటుంబీకులతో వెళ్లాడు. ఆదివారం ఉదయం అపార్టుమెంట్‌లో పక్కన ఉంటున్న నివాసితులు ఇంటి గెడ, గొళ్లాం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి విసయాన్ని కృష్ణకు తెలిపారు. దీంతో హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా బీరువా విరగొట్టి ఉంది. అందులో దాచిన సుమారు 23 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ జరిగినట్టు గుర్తించి ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ చక్రధర్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రెడ్డికంచరపాలెంలో చోరీ జరిగిన ఇంటిలో బీరువా పరిశీలిస్తున్న పోలీసులు

రెడ్డికంచరపాలెంలో ఒకటిన్నర తులాల బంగారం అపహరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉంచిన ఒకటిన్నర తులాల బంగారం, రూ.85 వేలు నగదును అపహరించుకుపోయారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రెడ్డి కంచరపాలెంలో ఉంటున్న రంధి సత్యనారాయణ బంధువుల పెళ్లి కోసం శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దేవరాపల్లి వెళ్లారు. పెళ్లి పూర్తయిన తర్వాత ఆదివారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి రాగా ప్రధాన ద్వారం తలుపునకు వేసిన గడియ కత్తిరించి ఉండడంతో కంగారు పడి ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. బీరులో ఉంచిన నగదు, బంగారం కనిపించలేదు. దీంతో కంచరపాలెం క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు ప్రధాన ద్వారం తలుపునకు ఉన్న గడియను కట్ చేసి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు కంచరపాలెం క్రైమ్ పోలీసులు తెలిపారు.

పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణపై అభిప్రాయ సేకరణ

... 5వ పేజీ తరువాయి

పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల తరలింపుపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గాజువాక, భీమిలిలో ఇటువంటి సమస్య ఎక్కువగా ఉండడంతో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావులు కొన్ని సూచనలు చేశారని తెలిసింది. ప్రధానంగా యూపీ పాఠశాలల ఎత్తివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరాజుపాలెం యూపీ పాఠశాలను కొనసాగించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. నగరం కంటే గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలల్లో పదిమంది విద్యార్థుల కంటే తక్కువగా ఉండడంతో ఆచితూచి వ్యవహ రించాలని కోరినట్టు తెలిసింది. పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ అమలులోకి వస్తే ప్రాథమిక పాఠశాలల్లో బోధనకు ప్రస్తుతం ఉన్న ఎస్జీటీలకు అదనంగా కొత్తగా నియమాకాలు చేపట్టాలని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు. అదే సమయంలో ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు మిగులుతారని అంచనాకు వచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ మేరకు కొత్త విధానం అమలులోనికి వస్తోందని భావిస్తున్నారు.

38 మంది బైక్ రేసర్ల అరెస్టు

... 5వ పేజీ తరువాయి

హాజరుపరిచాక కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని ఏడీసీపీ తెలిపారు. ఎవరైనా బైక్ రేసింగ్‌లు, ప్రమాదకరంగా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేసింగ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలను పాటించని వాహన చోదకులకు కొత్తగా అమలులోకి వచ్చిన చట్ట ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జోన్-1 ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు, ఈస్ట్ సర్కిల్-1 ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఈస్ట్ సర్కిల్-2 ట్రాఫిక్ సీఐ అప్పినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో షూట్ C/o. శివాజీ పార్కు

వేడుకలకు ముందు స్టిల్ ఫొటోలకు అనువైన చిత్రాలు, ఆకర్షణీయమైన లొకేషన్లు



ఎం.వి.పి.కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) :

ఏదైనా వేడుకలకు ముందు జరుపుతున్న ప్రీ ప్రోగ్రామ్స్ ఫొటోలకు ఎక్కడికి వెళ్లాలా అని ఆలోచిస్తున్నారా...? పచ్చని మొక్కలు, అందమైన పువ్వులు, చక్కని నిర్మాణాలు, వాటర్ ఫౌంటెన్లు, అందమైన లాండ్ స్కేపింగ్‌లతో నగరంలోని శివాజీపాలెం వద్ద నున్న శివాజీ పార్కు ఆహ్వానిస్తోంది. ఇక్కడకు ప్రతి రోజూ పదుల సంఖ్యలో పెళ్లి జంటలు ముస్తాబై, ఫొటో గ్రాఫర్లతో వస్తున్నారు. అలాగే చిన్నారుల పుట్టిన రోజు వేడుకలకు, సాధారణ ఫొటో షూటింగ్‌లకు జనం బాగానే వస్తున్నారు. దీంతో శివాజీ పార్కు షూటింగ్ స్పాట్‌గా మారిపోయింది.

జనాధరణ కాస్తా తక్కువే

శివాజీ పార్కు నిర్వహణ, అభివృద్ధి కోసం జీవీఎంసి భారీగానే నిధులు వెచ్చించింది. అప్పట్లోనే రూ.3 కోట్లతో పార్కు నిర్మించగా, తాజాగా మరో కోటి రూపాయలతో కొత్త సొబగులు తీర్చిదిద్దారు. అయినప్పటికీ ఈ పార్కుకు జనాదరణ కాస్త తక్కువనే చెప్పాలి. ముఖ్యంగా సరైన రవాణా సదుపాయం ఈ పార్కుకు అందుబాటులో లేదు. ప్రధాన రహదారి ఇసుకతోటకు, అటు పెదవాల్తేరు కూడలికి మధ్య బస్సు సౌకర్యం లేదు. ఈ పార్కుకు పెద్దగా ప్రచారం కూడా లభించకపోవడం మైనస్‌గా మారింది.

తక్కువ ఖర్చుతో చక్కని అనుభూతి

అయితే, ఇదే ఇప్పుడు ఫొటో గ్రాఫర్లకు కలిసొస్తోంది. పార్కులో జన సంచారం తక్కువగా ఉండటంతో ఫొటోలు తీసుకునేవారికి సులభతరంగా ఉంటోంది. ముఖ్యంగా ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు వచ్చే జంటలకు చుట్టూ పెద్దగా జనం ఉండకపోవడంతో ఫొటోలు తీసుకోవడానికి ఏ మాత్రం బిడియం ఉండటం లేదు. జంటలకు అవసరమైన దుస్తులు, ఇతర మేకప్ సామగ్రి తమ వెంట తెచ్చుకుంటున్నారు.





ఫొటోలు తీయించుకుంటున్న జంటలు

ఇదో రకం వ్యాపారం

కాస్త తెలివితేటలతో ఆలోచిస్తే, ఏదో ఒక వ్యాపార చిట్కా లభించకపోదు. ఒక ఐడియా జీవితాలను మారుస్తుందంటే ఇదేనేమో! పిల్లలకు పుట్టిన రోజు సందర్భమో లేదా ఇతరత్రా ఫొటోలు తీసుకోవడానికి వచ్చే వారితో పార్కు కళకళలాడుతోంది. ఈ పార్కులో ఉన్న కొన్ని బొమ్మల వద్ద పిల్లలను కూర్చోపెట్టి ఫొటోలు తీస్తుంటారు. తాజాగా ఇక్కడ కొందరు వ్యక్తులు పిల్లల ఫొటోలకు కావాల్సిన సామగ్రిని తీసుకువచ్చి అందుబాటులో ఉంచుతున్నారు. బొమ్మలు, చిన్న వాహనాలు, వివిధ రకాల వస్తువులను అద్దెకు ఇస్తున్నారు.గంటకు ఇంత అని అద్దెకు ఇస్తుండడంతో తల్లిదండ్రులకు, ఫొటో గ్రాఫర్లకు మరింత సులభమవుతోంది. ఆ బొమ్మలతో పిల్లలకు వివిధ యాంగిల్స్‌లో ఫొటోలు తీయించుకుంటున్నారు.

తక్కువ ఖర్చుతో సరి!

ఎక్కడెక్కడికో వెళ్లడానికి ప్రయాణ ఖర్చులు, సమయం, స్టూడియో ఖర్చుల కంటే శివాజీ పార్కుకు వస్తే కేవలం ప్రవేశ టిక్కెట్టు, అక్కడ బొమ్మలకు నామమాత్రపు ఖర్చు మాత్రమే ఉంటోంది. అందమైన పరిసరాలు కూడా ఉచితమేగా. అందుకే ఇప్పుడూ ఫొటో షూట్ కేరాఫ్ శివాజీ పార్కు.

వైభవంగా అప్పన్న స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాలతో స్వామివారికి చేస్తున్న దృశ్యం

సింహాచలం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం 108 బంగారు సంపెంగలతో స్వర్ణపుష్పార్చన వైభవంగా జరిగింది. దేవస్థానం వేదపండితులు వేద మంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పాలతో అర్చన గావించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజు స్వామివారిని సర్వాంగా సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠింపచేసి వేద మంత్రాలు, నాదస్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీస్వామివారి స్వర్ణపుష్పాన సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీస్వామివారి ఆర్జిత సేవలలో పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో పలు ప్రాంతాలను పరిశీలించిన ఈవో



పరిశీలిస్తున్న అదనపు ఈవో సుబ్బారావు

సింహాచలం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.సుబ్బారావు దేవస్థానం అధికారులతో పాటు ఆలయంలోని పలు ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గంగధార, రామాలయం, ప్రసాదం స్కీమ్ పనులు, స్వామివారి నిత్య అన్న ప్రసాదం ప్రాంతాలను పరిశీలించారు. భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజుకు సూచించారు. భక్తులు ఇబ్బంది పడకుండా క్యూలైన్లు వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు స్వీకరించే ఉచిత అన్న ప్రసాదం నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం ఆనంద నిలయంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నక్కా ఆనంద్ కుమార్ తో పాటు కార్యనిర్వహణ అధికారులు, పర్యవేక్షణ అధికారులతో సమావేశమయ్యారు. ఆలయంలో జరగబోయే పలు కార్యక్రమాలపై సమన్వయంతో పని చేయాలని సూచించారు.

సినిమా గైడ్

- **శబ్ధం** : సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా** : శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 13, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 36, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 46, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	90
లైవ్ ధర	110
విత్ స్కిన్	190
స్కిన్‌లెస్	200

పరిశోధనలు వర్సిటీకి కీలకం

ఏయూ వీసీ రాజశేఖర్



వీసీ రాజశేఖర్‌ను కలిసిన పరిశోధకులు

వెంకోజీపాలెం, మార్చి 02(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి ఎనలేని గుర్తింపును తీసుకువస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన పరిశోధకులు ఉద్దేశించి ఆయన మాట్లాడారు.

జీవీపీ ప్రతినిధుల అభినందనలు

ఏయూ వీసీగా పదవీబాధ్యతలు చేపట్టిన ఆచార్య రాజశేఖర్ ను గాయత్రీ విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు అభినందించారు. వర్సిటీని మరింత ఉన్నతంగా అభివృద్ధి చేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సంఘం

ఏయూ వీసీని పూర్వ విద్యార్థుల సంఘం అభినందించారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఛైర్మన్ కె.వి.వి.రావు , వైస్‌ఛైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, చంద్రశేఖర్, డాక్టర్ ఎస్.కె.ఈ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐడీఎస్‌ప్రతినిధుల భేటీ

ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్మెంట్ స్టడీస్ ఆంధ్ర ప్రదేశ్ ప్రతినిధుల బృందం ఏయూ వీసీని మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.గాలబ్ స్వయంగా ఆచార్య రొక్కం రాధాకృష్ణ ప్రసంగాలు, పరిశోధనకు సంబంధించిన పుస్తకాన్ని బహూకరించారు.

సభ్యుల సొంతింటి కలను నిజం చేస్తాం

- భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటరావు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యుల సహకారంతో ఫేజ్-3 సభ్యుల పాతికేళ్ల సొంతింటి కలను త్వరలోనే నిజం చేస్తామని భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీ కళాభారతిలో ఆదివారం జరిగిన సొసైటీ ఫేజ్-3 సభ్యుల సమావేశంలో పాలకవర్గం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి అంశాలను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. గృహ నిర్మాణాల కోసం బ్యాంకులతో జరిపిన చర్చలతో పాటు సభ్యుల వాయిదాల చెల్లింపు అంశాలను వివరించారు. గత పాలక వర్గం హయాంలో జరిగిన సుమారు రూ.3 కోట్ల నిధుల గల్లంతు విషయమై సభ్యుల సూచన మేరకు బోర్డు ట్రిబ్యునల్‌లో కేసు వేయడంజరిగిందన్నారు.

శ్రీరామ, సుగ్రీవుల స్నేహం మిత్రత్వానికి పరమార్థం



చాగంటి రాసిన 'వినదగునెవ్వరు చెప్పిన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గాయత్రి విద్యాసంస్థల కార్యదర్శి సోమరాజు, అన్నంరాజు సత్యనారాయణ

కొమ్మాది, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాముడు, సుగ్రీవుల ప్రవర్తన మిత్రులు ఎలా ఉండాలో మనకి నేర్పిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు పేర్కొన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా ఆదివారం యద్ధకాండలో రాయబార, రామరావణ యుద్ధ ప్రారంభ ఘట్టాలను వివరించారు. శుకసారణలు అనే రాక్షసులను శ్రీరాముడు, వానరుల బలము తెలుసుకోమని రావణుడు పంపించగా, వారు వానరుల వేషములలో వానర సైన్యంలో చేరుట, విభీషణుడు వారిని గుర్తుపట్టి శ్రీరాముడి వద్దకు తీసుకొచ్చుట, వానరులంతా వారిని సంహరించాలని యత్నించగా శ్రీరాముడు కరుణతో వారిని వదలివేయుట, తరువాత శబరుడు అనే రాక్షసుడు కూడా ఇదే తరహాలో ప్రవర్తించగా, అతడిని కూడా క్షమించటం శ్రీరాముడి కరుణాహృదయానికి నిదర్శనమని తెలిపారు. పరమక్రూరుడు అయిన రావణుడు శ్రీరాముడు సైన్యంతో దక్షిణ దిక్కుకు వచ్చిన సంగతి తెలుసుకొని తన వద్ద మాయోపాయాలు బాగా తెలిసిన రాక్షసుడితో శ్రీరాముడి శిరస్సు తయారు చేయించి సీతమ్మ వద్దకు వెళ్లి ముందురోజు రాత్రి శ్రీరాముడు నిద్రిస్తుండగా ప్రహస్తుడు శ్రీరాముడిని సంహరించి ఆయన శిరస్సును ఖండించాడని, వానరసైన్య ప్రముఖులను కూడా సంహరించారని, లక్ష్మణుడు పారిపోయాడని సీతమ్మకు చెప్పగా.. సీత పడిన ఆవేదనను వర్ణించారు. రావణుడు అంతఃపురానికి వెళ్లగా శ్రీరాముడు మాయా శిరస్సు అంతర్ధానం కాగా ఆకాశమార్గాన విభీషణుడి భార్య సరమ సీతకు రావణుడు చెప్పినదంతా అబద్ధమని శ్రీరాముడు యుద్ధ సన్నాహంలో ఉన్నాడని సీతమ్మకు తెలిపిన సంఘటనను వివరించారు. శ్రీరాముడు అంగదున్ని రావణుడి వద్దకు రాయబారం పంపి సీతమ్మను అప్పగించకపోతే రావణుడిని ససైన్యంగా సంహరిస్తానని చెప్పి పంపించిన ఘట్టాన్ని వివరించారు. అనంతరం విద్యార్థుల్లో నైతికవిలువలు పెంపొందించటానికి ఎందరో మహానుభావులు చెప్పిన మంచి మాటల్ని క్రోడీకరించి 116 అంశాలుగాగా 'వినదగునెవ్వరు చెప్పిన' శీర్షికతో చాగంటి కోటేశ్వరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీరాముడి చిత్రపటం ముందు ఉంచి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఎమెస్కో పుస్తక సంస్థల అధినేత ఎమెస్కో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా శ్రీ సీతారామ సేవా సంఘం ఎన్నికలు



క్యూలో నిలబడి ఓట్లు వేస్తున్న గ్రామస్థులు

వెంకోజీపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 124 ఓట్లతో పాటు సీనియర్ సిటిజన్ కింద 8 ఓట్లుతో మొత్తం 132 ఓట్లు ఉండగా సీనియర్ సిటిజన్ 6 ఓట్లు, బ్యాలెట్ ఓట్లు 123 పోలింగ్ జరిగాయి. సంఘం అధ్యక్ష పదవికి పోటీ పడిన 6 మంది అభ్యర్థులలో కర్రి వెంకట సూర్య అప్పారావు తమ సమీప అభ్యర్థి పొలమరశెట్టి త్రినాథ్‌పై 18 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి కర్రి నరేంద్ర కుమార్ తెలిపారు. కాగా పోటీ చేసిన ఆరుగురు అభ్యర్థులలో కె.వి.ఎస్.అప్పారావుకు 56 ఓట్లు, పొలమరశెట్టి త్రినాథ్‌కు 38, ఆడారి పరదేశినాయుడుకి 33 , కాళ్ల ఆనంద్‌కి 2 ఓట్లు లభించగా, కాళ్ల అప్పలరాజుకి ఒక్క ఓటు కూడా దక్కలేదు. అనంతరం సాయంత్రం జరిగిన నూతన కార్యవర్గంలో గెలుపొందిన అధ్యక్షులు కె.వి.ఎస్.అప్పారావు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో గౌరవ అధ్యక్షులుగా మళ్ల పోలిరాజు, ఉపాధ్యక్షులుగా పెంటకోట ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శిగా కర్రి రవికుమార్, కోశాధికారిగా యల్లపు శ్రీను, సహాయ కార్యదర్శులుగా కర్రి రఘు, కర్రి గోవింద, ఆడిటర్‌గా కాళ్ల అప్పలరాజు, ప్రచార కార్యదర్శిగా ఆడారి శివప్రకాష్‌లు ఎన్నికయ్యారు. వీరంతా ఏడాది కాలం పాటు పదవిని కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, పీల వెంకట పరదేశినాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు. పాల్గొన్న విద్యార్థులు

వెంకోజీపాలెం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : ఏయూ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఏయూ వీసీ ఆచార్య జీపీరాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ. పల్లవి మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక, మేధో అంశాలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 6,7, తేదీలలో రెండు రోజులు కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. వీటిలో ఏయూ యునైటెడ్, గర్ల్ ఆఫ్ విద్యార్థులు బృందాలు భాగస్వాములు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గించండి

ఎమ్మెల్యే వెలగపూడికి హోటల్స్ నిర్వాహకుల వినతి



ఎమ్మెల్యే వెలగపూడికి తమ ఆవేదన చెబుతున్న హోటల్స్ మర్చెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హోటల్ నిర్వహించేవారికి జీవీఎంసీ విధిస్తున్న అధిక పన్నుల భారం నుంచి ఉపశమనం కలిగించాలని విశాఖపట్నం హోటల్ మర్చెంట్స్ అసోసియేషన్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడిని కలసిన హోటల్స్ వ్యాపారులు తమ ఆవేదన విన్నవించుకున్నారు. ఏపీఎంసీ చట్టంలోని సెక్షన్ 420, 421 ప్రకారం ప్రకటనల పన్ను భారీ మొత్తంలో కట్టమని జీవీఎంసి పట్టణ ప్రణాళిక విభాగం నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తమ వ్యాపార సంస్థలపై ఏర్పాటు చేసుకునే బోర్డులు ఈ సెక్షన్ పరిధిలోకి రాకపోయినా తమకు నోటీసులు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే తాము జీవీఎంసికి ట్రేడ్ లైసెన్స్ ఫీజు, ఆస్తి పన్నుతో పాటు జీఎస్టీ, ఇన్‌కంటాక్స్ వంటివి చెల్లిస్తున్నామని, కరోనా తర్వాత వ్యాపారాలు తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నాయన్నారు. మా నేమ్ బోర్డులు అడ్వర్టైజ్మెంట్ పరిధిలోకి రావని, అవి అడ్రసింగ్ బోర్డులు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సమస్యపై దృష్టి సారించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ప్రియాంక విద్యోదయ పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ కమ్ ప్రిన్సిపాల్ భగీరథ

సిరిపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రియాంక విద్యోదయ పాఠశాల 32వ వార్షికోత్సవ వేడుకలను సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ భగీరథ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించడం ద్వారా పాఠశాలకు ఇంతటి పేరుప్రఖ్యాతులు లభించాయన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. 2024లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆధ్యాత్మిక శక్తితోనే అశాంతి నుంచి ఉపశమనం

స్వామి పరిపూర్ణానంద



మద్దిలపాలెం, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతిలో ఆదివారం పూజ్యశ్రీ స్వామి పరిపూర్ణానంద ఆధ్యాత్మిక ప్రవచనాలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. స్వామిజీ మాట్లాడుతూ మనిషి జీవితం వివిధ తాపత్రయాలతో ముడిపడివుంటుందని, వాటికి తాత్కాలిక ఉపశమనం, శాశ్వత పరిష్కారం రెండువిధాలుగా లభిస్తుందన్నారు. ఉపశమనాల నుంచి పరిష్కారం దిశగా మారేందుకు ఆధ్యాత్మిక శక్తి మాత్రమే తోడ్పడుతుందన్నారు. వదలడం కాకుండా ఎదగడం వేదాంత ఉద్దేశమని వివరించారు. మహాత్ములందరూ ఈ బాటలో నడిచి, మనకు ఇదే విషయాన్ని ఉద్బోధించారన్నారు. వాహనాలు నడపడానికి ఇంధనం ఎంత అవసరమో జీవితం సజావుగా సాగేందుకు సాధన అంతే ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చైర్మన్ మంతెన సత్యనారాయణ, కార్యదర్శి రాంబాబు, ప్రసాద్, చిట్ట పంతులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా చేయూత అందించాలి

ఏయూ వీసీ రాజశేఖర్‌కు దివ్యాంగుల వినతి



వీసీని కలిసిన దివ్యాంగులు

వెంకోజీపాలెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఏయూకి వీసీగా ఐఐటీ నుంచి విచ్చేసిన ప్రొఫెసర్ జేపీ రాజశేఖర్‌కు దివ్యాంగులు ఆదివారం కలిసి అభినందనలు తెలియజేశారు. దివ్యాంగులను అకడమిక్‌గా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా వీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్‌మీనన్, రాజేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.